తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర బిసి వెల్ఫేర్ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ

## హీట్‌షీల్డ్ స్థానంలో
# సన్ ప్రతాపం

**- అంతరిక్ష కేంద్రంలో అద్భుత చిత్రం ఆవిష్కరణ**





శ్రీహరికోట (తడ), ఏప్రిల్ 20 ప్రభాతవార్త : శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రంలో అద్భుతచిత్రం ఆవిష్కృతమైంది. రెండు దశలు అనుసంధానం పూర్తి చేసుకొని ప్రయోగ వేదికకు తరలివస్తున్న శీర్షభాగంలో మండుతున్న సూర్యుడు ఫొటోకి చిక్కింది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు ఎక్కువై భానుడు బీభత్సంగా మారిన సమయాన రాకెట్ కేంద్రంలోనూ ఎండ ప్రభావం అంతే తీవ్రంగా ఉంది. ఈ సారి పిఎస్ఎల్‌వి సి-55 రాకెట్ నిర్మాణం శాస్త్రవేత్తలు సరికొత్తగా చేపట్టారు. నాలుగు దశలను ఒకేచోట కాకుండా రెండుచోట్ల అనుసంధానం చేశారు. కొత్తగా నిర్మించిన భవనంలో రెండు దశలను అనుసంధానించి మూడు, నాలుగు దశలకు శీర్షభాగాన ఉష్ణకవచం అమర్చేందుకు ప్రయోగ వేదికకు రాకెట్‌ను రైలుపట్టాలపై తరలించారు. ఈ సమయాన ఉష్ణకవచం ఉండాల్సిన చోట ఉష్ణోగ్రతను పెంచే సూర్యుడు ఉన్న సమయంలో ఫొటోగ్రాఫర్ క్లిక్‌మనిపించాడు. ఈ చిత్రాన్ని ఇస్రో అధికారికంగా విడుదల చేసింది. ఇదిలావుంటే శ్రీహరికోటలో శనివారం మధ్యాహ్నం 2.19 గంటలకు జరిగే పిఎస్ఎల్‌వి సి-55 రాకెట్ ప్రయోగానికి సంబంధించి గురువారం కీలక సమావేశాలు నిర్వహించారు. మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశం పూర్తి చేశారు. లాంచ్ రిహార్సల్స్ విజయవంతంగా నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం ఈ రాకెట్ ప్రయోగానికి సంబంధించి కౌంట్‌డౌన్ ప్రారంభించనున్నారు. ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ శుక్రవారం ఉదయానికి షార్‌ను చేరుకొని రాకెట్ ప్రయోగ సన్నాహాల్లో పాలుపంచుకుంటున్నారు.

# ఇళ్ళ నిర్మాణాల్లో పురోగతి తప్పనిసరి

**జాతీయ రహదారుల భూసేకరణ త్వరితంగా పూర్తి**
**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సగిలి షన్మోహన్

చిత్తూరు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇళ్ళ నిర్మాణాల్లో రోజు వారి పురోగతి తప్పనిసరిగా వుండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి గురువారం భూముల రీ-సర్వే, జాతీయ రహదారుల నిర్మాణం, చిరుధాన్యాల సాగు, జగనన్న ఇళ్ళ నిర్మాణాలు తదితర అంశాలపై వర్చువల్ విధానంలో కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సమీక్షకు కలెక్టరేట్ నుండి కలెక్టర్ సగిలి షన్మోహన్, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షిస్తూ జగనన్న భూహక్కు భూ రక్ష కార్యక్రమంలో భాగంగా మొదటి విడత సర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వే రాళ్ళు నాటే కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. 2వ విడత సర్వేకు సంబంధించి గ్రౌండ్ ట్రూథింగ్, గ్రౌండ్ వాల్యూయేషన్, భూహక్కు పత్రాలు అందజేయడం తదితరాలు ప్రణాళికా బద్ధంగా చేపట్టి పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం స్పందన కార్యక్రమంకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల నుండి సమస్యలపై అందే అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. జాతీయ రహదారులకు సంబంధించి భూ సేకరణ పనులు పెండింగ్‌లో వుంటే సత్వరం పూర్తి చేయాలన్నారు. ఐక్యరాజ్యసమితి ఈ ఏడాది చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందని, ప్రజల ఆరోగ్య సంరక్షణ నిమిత్తం చిరుధాన్యాల సాగు ప్రోత్సహించేలా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదర్థాలను కలెక్టరేట్‌లో జరిగే సమావేశాల్లో వినియోగించాలన్నారు. ఇళ్ళ నిర్మాణంలో భాగంగా జిల్లాలో 74,319 ఇళ్ళు మంజూరు కాగా ఇందులో 24,596 ఇళ్ళు లేఅవుట్లు, 49,723 ఇళ్ళు సొంత స్థలాల్లో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఇందులో 65 వేల ఇళ్ళు గ్రౌండ్ అయ్యాయన్నారు. జగనన్న లేఅవుట్లలో మౌళిక సౌకర్యాలు కల్పించడానికి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, హౌసింగ్ పిడి పద్మనాభం, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ శంకర్‌బాబు, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూధన్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బోల్తా పడ్డ స్కార్పియో

**బాలుడు మృతి - 10 మందికి గాయాలు**





బోల్తా పడిన స్కార్పియో , ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి

*నగరి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:* మండలంలోని గుండ్రాజుకుప్పం మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నాలుగేళ్ళ బాలుడు మృతి చెందగా 10 మంది గాయాలపాలైన సంఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసంతి వివరాల మేరకు... తమిళనాడు కృష్ణగిరికి చెందిన శంకరమ్మ, బత్తెమ్మ, ఇంద్ర, యువరాణి, గంగమ్మ, అమరావతి, నాగప్ప, రాము, శ్రీనివాసన్ వీరితో పాటు నలుగురు చిన్నారులు, డ్రైవర్ ముత్తురాజును తీసుకుని స్కార్పియో వాహనంలో బుధవారం తిరుమలకు వెళ్లారు. శ్రీవారి దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా నగరి మండలం గుండ్రాజుకుప్పం మలుపు వద్ద రోడ్డుఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి వాహనం అదుపు తప్పడంతో రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కృష్ణగిరి జిల్లా తీర్థం గ్రామానికి చెందిన అకింత్(5) అనే బాలుడు సంఘటనా స్థలంలోనే మృతి చెందగా పది మందికి గాయాలయ్యాయి. పోలీసులు బాలుని మృతదేహాన్ని మార్చురీకి తరలించి గాయాలపాలైన వారికి ప్రాథమిక చికిత్స అందించి ఉన్నత వైద్య సేవల నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు.

# పట్టా ఇచ్చారు..రద్దు చేశారు..

**మనస్తాపంతో భాదితుడు ఆత్మహత్యాయత్నం**

నాగలాపురం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:



జగనన్న కాలనీకి సంబంధించి ఇచ్చిన ఇంటిపట్టా ఇచ్చినట్టే ఇచ్చి రద్దు చేయడంతో మనస్తాపానికి గురైన భాదితుడు ఆత్మాహత్యా యత్నానికి పాల్పడ్డాడు. అధికార పార్టీకి చెందిన సర్పంచ్, ఇతర నేతల ప్రోద్భలంతోనే తన పట్టా రద్దు చేశారని భాదితుడు వాపోతూ ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. సాక్ష్యాత్తు నాగలాపురం తాహసీల్దార్ కార్యాలయం లోపలే ఈఘటన జరగడంతో రెవిన్యూ శాఖలో ఆత్మశోధన మొదలైంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సురుటుపల్లి గ్రామానికి చెందిన రేణుబాబు అనే వ్యక్తి, వీఆర్వో చంద్రశేఖర్ తన జగనన్న ఇంటి పట్టా రద్దు చేయడానికి గల కారణాలేమిటో తెలుసుకోవడానికి గురువారం రెవిన్యూ కార్యాలయానికి చేరుకున్నాడు. సంబంధిత అధికారుల నుంచి సరైన సమాధానం లేకపోవడంతో మనస్తాపానికి గురైన భాదితుడు తహశీల్దార్ ప్రసన్న కుమార్ రెడ్డి ఎదుటే పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. అయితే సమాఛారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని భాదితుడిని నగరి ప్రభుత్వ ఆస్ఫత్రికి తరలించారు.

## మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు
# అన్ని పార్టీలు ఐక్యం కావాలి

**-సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శుల పిలుపు**



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త

కార్పొరేట్ కూటమిగా సాగుతున్న బిజెపి ప్రభుత్వాన్ని రానున్న సాధారణ ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని అన్ని రాజకీయపార్టీలు, ప్రజలు ఐక్యం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణలు పిలుపునిచ్చారు. వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులు అందుకు నడుం కట్టాలన్నారు. కేంద్రంలో ప్రజా వ్యతిరేఖ విధాదనాలకు మద్దతిస్తున్న రాష్ట్ర అధికార పార్టీ వైసిపిని, బిజెపిని వేర్వేరుగా చూడొద్దని పేర్కొన్నారు. నిరంకుశ, మతోన్మాద బిజెపిని సాగనంపి దేశాన్ని కాపాడుకుందాం అన్న నినాదంతో ఉభయ కమ్యూనిష్టు పార్టీలు చేపట్టిన ప్రచారబేరి బహిరంగ సభ గురువారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద బహిరంగసభ ఏర్పాటుచేశారు.ఈసభకు సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాసరావు, రామకృష్ణలు ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వీరు మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం హిందూత్వ కార్పొరేట్ కూటమని, ఓవైపు దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చాలని ప్రయత్నిస్తూనే మరో వైపు కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందుతుందన్నారు. దళితులు, ముస్లిం మైనార్టీలకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. తాము అధికారంలోకి వస్తే విదేశాల్లో దాచిన నల్లధనాన్ని తిరిగి తెస్తామని, ప్రతి కుటుంబ ఖాతాలో రూ.15లక్షలు వేస్తామని తొమ్మిదేళ్ళ క్రిందట ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలైన చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి కేటాయిస్తామన్న నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నిరంకుశ విధానాలు, రాష్ట్రాల హక్కులు హరించేలా ఉన్న నేపథ్యంలో తెలంగాణా, తమిళనాడు, కేరళ వంటి ప్రభుత్వాలుమోడీకి వ్యతిరేఖంగా పోరాడుతున్నాయన్నారు. రేణిగుంట ఎయిర్‌పోర్టును అమ్మకానికి పెట్టారని, మన రాష్ట్రానికి తలమానికమైన విశాక ఉక్కును ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కడపస్టీల్ ప్యాక్టరీని అడ్డుకుంటున్నారని, మన్నవరం బెల్ ఫ్యాక్టరీని గుజరాత్‌కు తరలిస్తున్నారని తెలిపారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలోవైసిపిని ఓడించాలంటే ఉభదరు ఐక్యం కావాలన్నారు. ఈరెండు ప్రభుత్వాలను దీటుగా ప్రశ్నిస్తున్నది వామపక్ష పార్టీలే అని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రామానాయుడు, వందవాసి నాగరాజు, అంగేరిపుల్లయ్య, జయలక్ష్మి, మురళీ, జనార్ధన్, పెంచలయ్య, రాధాకృష్ణ, నళిని, అజయ్, జనమాలగురవయ్య, మణి తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమానికి జగన్ - సంక్షోభానికి చంద్రబాబు

**- మంత్రి రోజా**



నగరి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రజలు సంక్షేమపాలనతో ఆనందంగా ఉంటే చంద్రబాబు పాలనలో సంక్షోభంతో ప్రజలు అల్లాడిపోతున్నారని మంత్రి రోజా అన్నారు. గురువారం ఆమె నగరి మున్సిపాలిటీ 20వ వార్డుకు చెందిన సత్రవాడ-02 సచివాలయ పరిధిలోని సత్రవాడ డీడబ్ల్యు, సత్రవాడ ఎస్టీ కాలనీ, టీఆర్ కండ్రిగ, బుగ్గ కండ్రిగ గ్రామాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిజగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో తమ జీవితాల్లో వెలుగులు నిండాయని ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తున్నారని తెలిపారు. మహిళలు ఆప్యాయంగా హారతులు పట్టి ఆహ్వానించారు. ప్రతి గడపలోను నివాస్తులను పలకరించిన మంత్రి వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని వివరిస్తూ వారికి ఉన్న సమస్యలను ఆరా తీశారు. అధికారుల ద్వారా సమస్యకు పరిష్కార మార్గం చూపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, కౌన్సిలర్ గాయత్రి, కన్వీనర్ సుభాషిణి, దేశమ్మ దేవాలయ కమిటీ అధ్యక్షులు వేణుబాబు, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, నాయకులు శశికుమార్, రామకృష్ణ, రమేష్, దినకర్, సచివాలయ అధికారులు, గృహ సారథులు, నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

చిత్తూరు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:



జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ బిఎన్.రాజ సింహులు, మాజీ మేయర్ కఠారి హేమలత, జిల్లా దేశం ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్‌లు కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా నాయకులు దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలతలు మాట్లాడుతూ సుదీర్ఘకాలం ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన చంద్రబాబునాయుడు ప్రజా సంక్షేమం కోసం అమలు చేసిన పలు పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్ళీ విజయం సాధించి చంద్రబాబునాయుడు సిఎంగా బాధ్యతలు స్వీకరిస్తారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి వెంకిటీల సురేంద్రకుమార్, మాజీ డిప్యుటీ మేయర్ సుబ్రి, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధే జగనన్న అజెండా : డిప్యూటీ సీఎం నారాయణస్వామి



వెదురుకుప్పం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త : రాష్ట్ర అభివృద్ధే జగనన్న అజెండాగా ముందుకు వెళ్ళుతున్నారని, పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రయోజనం చేకుర్చే విధంగా పాలన అందించడం జరుగుతుందని రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేర్కొన్నారు. మండలంలోని నల్లవెంగనపల్లె సచివాలయం పరిధిలోని నల్లవెంగనపల్లె హరిజనాడ, తాటిమాకులపల్లె, తదితర గ్రామాల్లో రెండవ రోజు గురువారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్ళి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాల ప్రయోజనం ఏ మేరకు లబ్ధి పొందుతున్నారని మహిళలను ప్రశ్నించి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. సర్పంచ్ పుష్ప శివాజీ, మండల పార్టీ అధ్యక్షులు కామసాని పద్మనాభ రెడ్డి, ఎంపీపీ నాగరాణి, జడ్పీటీసీ సభ్యులు సుకుమార్, ఎంపిడీవో సుధాకర్‌రావు, తహాశీల్ధార్ పుల్లా రెడ్డి, రాష్ట్ర వైసీ పీ కార్యదర్శి బండి గోవర్ధన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి హేమ సుందర్ రెడ్డి, మండల గృహసారధుల కన్వీనర్ బట్టే సుబ్రమణ్యం, నాయకులు మరకాల కుప్పం రామయ్య, ధనంజేయులు రెడ్డి, బొజ్జా రెడ్డి, గోవిందన్ తదితరులు పాల్గొన్నారు.

# అవయవదానంపై విస్తృత అవగాహన

**-బర్డ్‌కు ప్రత్యేక వెబ్‌సైట్ -ఆయుర్వేద ఆస్పత్రి భద్రతకు సిసికెమెరాలు**



తిరుమల,ఏప్రిల్ 20ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని పద్మావతి చిన్నపిల్లల గుండె చికిత్సల ఆస్పత్రిలో చిన్నారులకు గుండెమార్పిడి కోసం అవయవదానం చేసేవారికి అవగాహన కల్పించేలా చూడాలని టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రికి ప్రత్యేకంగా వెబ్‌సైట్ సిద్ధం చేయాలన్నారు. ఆస్పత్రి అభివృద్ధిలో, వైద్యసదుపాయాలు మెరుగుపరచడంలో భాగంగా ప్రజలకు తెలిసేలా చూడాలన్నారు. ఆయుర్వేద ఆస్పత్రి భద్రతకు సిసికెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పంచకర్మ చికిత్సకు మంచి స్పందన వస్తుండటంతో ఈ విభాగానికి వీలైనంతమంది సిబ్బందిని నియమించుకోవాలని ఆదేశించారు. టిటిడిఆధ్వర్యంలోని స్విమ్స్,బర్డ్, అశ్విని, సెంట్రల్ ఆస్పత్రుల్లోని డాక్టర్లందరికీ ఒకరికి 40మంది లెక్కన టిటిడి రెగ్యులర్ ఉద్యోగులు,వారి కుటుంబసభ్యులను కేటాయించి ఫ్యామిలీ డాక్టర్‌ను అమలుచేయాలని సూచించారు. గురువారం టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి, జెఇఓ సదాభార్గవి, ఎఫ్ఎసిఎఓ బాలాజీ, పద్మావతి చిన్నపిల్లల గుండె చికిత్సల ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డి, బర్డ్ ప్రత్యేక అధికారి డాక్టర్ రెడ్డప్పరెడ్డి, ఇన్‌ఛార్జి చీఫ్‌మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నర్మదలతో కలసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

# రాష్ట్ర పండుగగా తిరుపతి గంగమ్మ జాతర

**తిరుపతి జాతరను దేశవ్యాప్తం చేద్దాం: ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి**
**గంగజాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తాం: మేయర్ శిరీష, కమిషనర్ హరిత**



తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త సాక్షాత్తు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి చెల్లెలైన తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించిందని, మనమంతా కలిసి గంగమ్మ జాతర ఉత్సవాలను దేశవ్యాప్త పండుగలా నిర్వహించాలని తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి ఆకాంక్షించారు. తిరుపతి గంగమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ రెడ్డి, ముద్రనారాయణ, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి స్వయానా చెల్లెలైన తిరుపతి గంగమ్మకు ప్రతి సంవత్సరం జాతరకు సారేను తీసుకుని సమర్పించడం ఆనవాయితీగా ఉన్నదని తెలుపుతూ మే ఒకటవ తేది నుంచి 5వ తేది వరకు మహా కుంభాభిషేకంతో జీర్ణోద్ధరణ చేయించిన నూతన ఆలయంలోని 5వ తేదిన గర్భగుడిలోకి గంగమ్మను ప్రతిష్టించడం జరుగుతుందన్నారు. అదే విధంగా మే 9వ తేది నుంచి తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర మొదలవుతుందన్నారు.ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించడం ఎంతో శుభ పరిణామన్నారు. రాష్ట్ర పండుగగా జరుపుకోబోవు తాతయ్యగుంట గంగ జాతరను దేశవ్యాప్తంగా గుర్తించేలా చేయాల్సిన బాధ్యత మన పై ఉందన్నారు. గంగమ్మ తల్లి అమ్మవారి జాతరను గంగమ్మ తల్లి బ్రహ్మోత్సవాలుగా జరుపుకుందామని భూమన కరుణాకర్ రెడ్డి కోరారు. తిరుపతి నగర పాలక సంస్థ గంగమ్మ జాతర నిర్వహణ కోసం ప్రకటించిన 25 లక్షల రూపాయిలు చెక్కును ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి చేతులు మీదుగా మేయర్ డా. శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్ర నారాయణలు గంగమ్మ ఆలయ ఈఓ మునికృష్ణకు అందజేసారు. సమావేశంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, రెవెన్యూ అధికారి కెఎల్ వర్మ, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రమణ్యం, షణ్ముగం, డిఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్రరెడ్డి, సంజీవ్ కుమార్, దేవిక, గోమతి, మేనేజర్ చిట్టిబాబు, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచెయ్య, సుమతి, అధికారులు పాల్గొన్నారు.

# రోజుకు 3 లక్షల లీటర్ల పాల సేకరణ

**: డిఆర్‌డిఎ పిడి**



చిత్తూరు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: జిల్లాలో రోజుకు 3 లక్షల లీటర్ల పాలసేకరణ లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ డైరీ అధికారులను ఆదేశించారు. చిత్తూరు డిఆర్‌డిఎ సమావేశభవనంలో గురువారం డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ శ్రీజ సిబ్బంది, ఉమ్మడి చిత్తూరు జిల్లా డైరీ ఎపిఎంలతో 74 బిఎంసియుల్లో పాల సేకరణ, నాణ్యత, ఇతర నిర్వహణపై సమీక్షించారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ మాట్లాడుతూ ఈ నెలాఖరు నాటికి జిల్లాలోని అన్ని బిఎంసియుల్లో వంద శాతం పాల సేకరణ చేపట్టాలన్నారు. ప్రస్తుతం రోజుకు 3 లక్షల లీటర్ల పాల సేకరణ చేపట్టాల్సివుండగా 2,39,171 లక్షల లీటర్ల పాలు సేకరణ జరుగుతుందన్నారు. ఈ విషయంపై డైరీ ఎపిఎంలు, జనరల్ ఎపిఎంలు, సిసిలు సంయుక్తంగా గ్రామాల్లో పాల సేకరణపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి పాల సేకరణ పెంపుకు చర్యలు చేపట్టాలన్నారు. వేసవి కాలం కావడంలో కరెంటు కోతలు వుండే అవకాశం వుంటుందని దీనిపై అప్రమత్తంగా వుండి ఎప్పటికప్పుడు బిఎంసియుల్లో ఎద్దైనా సమస్య వస్తే స్పందించి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో శ్రీజ డైరీ నుండి తిమ్మప్ప, ప్రొక్యూర్‌మెంట్ హెడ్, టెక్నికల్ పర్సన్ కట్టి, నాగరాజు, డిఆర్‌డిఎ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగుయువత నేతలచే చలివేంద్రం ప్రారంభం



**కుప్పం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** తెదేపా అధినేత చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా పేద ప్రజల దాహార్తి తీర్చేందుకు కుప్పం నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు మణి అధ్వర్యంలో కుప్పం బస్టాండు వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత గోపీనాథ్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్ర శేఖర్, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎంపిపిలు సాంబశివం, డా॥ వెంకటేష్, కౌన్సిలర్ సోమశేఖర్, యువత నాయకులు రాజేంద్ర, శంకర్‌చలం, కమల్ సతీష్, రామాంజులు, సుబ్బు, బాలాజీ, గిరి, మురళి, సుందర్, వినోద్, బాలాజీపాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం సిఎం జగనన్నతోనే సాధ్యం : ఎమ్మెల్సీ



**కుప్పంరూరల్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి సిఎం జగనన్నతోనే సాధ్యమని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ పేర్కొన్నారు. గురువారం మంకలదొడ్డి పంచాయతీ చిన్నగోపనపల్లి, పెద్ద గోపనపల్లి, అగ్రహారం గ్రామాల్లో 411 గృహాలను గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమంలో సందర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి అశ్విని మురుగేష్, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, మండల కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్, రాష్ట్ర వన్నియకుల క్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ వనిత శ్రీను, ఎంపిటిసి మోహన్, సర్పంచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## 20కోట్ల ఉపాధిహామీ పనులపై సామాజిక బహిరంగ సభ

**శాంతిపురం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** శాంతిపురం మండలంలోని 23 పంచాయతీల్లో 2021-22, 2022-23ఆర్థిక సంవత్సరాల్లో జరిగిన ఇరవై కోట్ల రూపాయల ఉపాధిహామీ పనులపై గురువారం మండల కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. వివిధ పంచాయతీల్లో జరిగిన పనులు, నిధుల పక్కదారి విషయాలపై అధికారులు ఆరా తీశారు. గురువారం రాత్రి వరకు ఈసభ కొనసాగింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కార్యక్రమంలో పిడి గ ంగాభవాని, డివిఒ భాగ్యలక్ష్మి, ఎపిడి వెంకటరత్నం, జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, పెద్దన్న, దండపాణి, ఎంపిడిఒ హేమమాలిని, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.



## రాష్ట్రానికి చంద్రబాబునాయుడు నాయకత్వం అవశ్యం

-చంద్రబాబు జన్మదిన వేడుకలలో పులివర్తి నాని

**తిరుపతిరూరల్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:**



రాష్ట్రంలో ప్రస్తుతం నెలకున్న పరిస్థితుల దృష్ట్యా ప్రజలు చంద్రబాబునాయుడు నాయకత్వాన్ని కొరుకొంటున్నారని చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడు, చంద్రగిరి టిడిపి ఇన్‌చార్జి పులివర్తి నాని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను గురువారం రఘునాథ్ రిసార్ట్స్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. చంద్రబాబు జన్మదిన వేడుకలకు తిరుపతిరూరల్ మండలంలోని టిడిపి శ్రేణులు పాల్గొని సంబరాలు చేసుకున్నారు. పులివర్తి నాని కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా పాలన గాడి తప్పిందని, దోచుకో..దాచుకో అనే విధంగా వైకాపా ప్రజాప్రతినిధుల పరిస్థితి తయారైందని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి రూరల్ టిడిపి అధ్యక్షుడు ఏ.ఈశ్వరరెడ్డి, నేతలు కృష్ణమూర్తి రెడ్డి, నాగూరు శ్రీనివాసులు, హేమలత, తిరుచానూరు కిశోర్, దుర్గసముద్రం మునిశేఖర్, మోహన్‌రెడ్డి, సాల్మన్‌రాజ్, మంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నగరిలో టీడీపీ అధినేత చంద్రబాబు జన్మదిన వేడుకలు

**నగరి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు 73వ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. నగరి మండలంలో, మున్సిపాలిటీల్లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కోలాహలంగా నినాదాలు చేశారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

**బంగారుపాళ్యం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:**

పంటలు సాగు చేయడానికి చేసిన అప్పులను తీర్చలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకొన్న సంఘటన మండలంలోని బివిల్ కండ్రిగలో జరిగింది. ఈ నెల 13వ తేదీ గ్రామానికి చెందిన ఎం.ప్రభాకర్‌నాయుడు (63) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తీసుకెళ్ళారు. ఇక్కడ చికిత్స పొందుతూ ప్రభాకర్‌నాయుడు గురువారం మృతి చెందాడు. పంటలు సాగు చేయడానికి పలువురి వద్ద ప్రభాకర్‌నాయుడు అప్పుడు చేశాడు. పంటలు సరిగా పంటకపోవడంతో అప్పుల భారం పెరగడంతో తీవ్ర మనస్థాపంకు గురై ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు ప్రభాకర్‌నాయుడు కుమారుడు దిలీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు.

## ఘనంగా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు



**బంగారుపాళ్యం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు 73వ జన్మదిన వేడుకలను మండలంలో టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు జయప్రకాష్, ఉపాధ్యక్షుడు కమలనాథరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కోకా ప్రకాష్‌నాయుడు, తెలుగు యువత అధ్యక్షుడు రమేష్, గీత కార్మిక ప్రధాన కార్యదర్శి బుస్సా నాగరాజ, టిడిపి నాయకులు హేమచంద్రనాయుడు, రాధాకృష్ణ, జాకీర్, నాసిర్, చందు, మంజునాథ్, వంశీకృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు

## ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు



**బంగారుపాళ్యం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** ప్రతి ఇంటికి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను చీకూరిపల్లి, సిఆర్ నగర్ కాలనీల్లో ఎమ్మెల్యే చేపట్టారు. ప్రతి ఇంటికి ఎమ్మెల్యే వెళ్ళి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, ఎఎంసి ఛైర్మన్ నారే సోమశేఖర్, పలువురు అధికారులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు. అలాగే సాయంత్రం బంగారుపాళ్యం జమీయా మసీదులో ముస్లీం సోదరులకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముస్లీం సోదరులతో ఎమ్మెల్యే కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, ఎఎంసి ఉపాధ్యక్షుడు సర్ధార్, మాజీసర్పంచ్‌కృష్ణమూర్తి, ముత్తువల్లీనూర్, బలిజపల్లిబాబుసాహెబ్, మున్నా, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## డిఐజిని కలిసిన ఎస్పీ రిశాంత్‌రెడ్డి



**చిత్తూరు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** అనంతపురం రేంజ్ డిఐజిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్‌ఎస్ అమ్మిరెడ్డిని గురువారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతపురం రేంజ్ డిఐజి కార్యాలయంలోని డిఐజి ఛాంబర్‌లో ఎస్పీ రిశాంత్‌రెడ్డి డిఐజిగా బాధ్యతలు స్వీకరించిన ఆర్‌ఎస్ అమ్మిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ రిశాంత్‌రెడ్డి చిత్తూరు జిల్లాలో శాంతి భద్రతలు, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు సరిహద్దుగా జిల్లా వుండటంతో అక్రమ మద్యం, గంజాయి, తదితర మత్తు పదర్థాలు అక్రమ రవాణా జరుగకుండా గట్టి నిఘూ పెడ్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ రిశాంత్‌రెడ్డి డిఐజితో సుదీర్ఘంగా చర్చించారు.

## ఐసిడిఎస్ కార్యాలయంలో అగ్నిప్రమాదాలపై అవగాహన

**కుప్పంరూరల్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం కుప్పం ఐసిడిఎస్ కార్యాలయంలో కుప్పం ఫైర్ అధికారి ప్రవీణ్‌కుమార్ అధ్వర ్యంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిడిపిఒ అరుణశ్రీ, ఫైర్ సిబ్బంది నరేష్, కృష్ణయ్య, బాలకృష్ణ, లక్ష్మీనారాయణ, సతీష్‌కుమార్, రామూర్తి, రఘుపతి పాల్గొన్నారు.



# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఘనంగా సిబిఎన్ జన్మదిన వేడుకలు



**చౌడేపల్లి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తేదేపా మండల యువజన నాయకుడు కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు నందు అన్నదాన కార్యక్రమం జరిగింది. బాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. సుబ్రమణ్యం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాణిపాకంలో ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



**కాణిపాకం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** రాష్ట్ర మాజీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు 74వ జన్మదిన వేడుకలను గురువారం కాణిపాకంలో ఘనంగా నిర్వహించారు. ఈమేరకు స్థానిక పాత సంతగేటులో మండల టీడీపీ నాయకులు భారీ ఎత్తున చంద్రబాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు. కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ జడ్పీటీసీ ఎం.లత, స్థానిక మాజీ సర్పంచ్ మధుసూదన్‌నాయుడుల ఆధ్వర్యంలో భారీ కేక్ క ట్ చేసి పంచిపెట్టారు. అలాగే పేదలకు అన న్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు పూర్ణచంద్రరావు, నరసింహులు నాయుడు, బాలకృష్ణ, హేమాద్రి, శేషాద్రినాయుడు, బాబునాయుడు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐరాలలో ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



**ఐరాల, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** ప్రభాతవార్త: రాష్ట్ర మాజీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు 74వ జన్మదిన వేడుకలను గురువారం మండలంలో అత్యంత ఘనంగా నిర్వహిం చారు. ఈసందర్భంగా మండల టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈమేరకు మండల కేంద్రం ఐరాల, చుక్కావారిపల్లె, గూబలవారిపల్లె గ్రామాల్లో చంద్రబాబు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అలాగే చుక్కావారిపల్లె పంచాయతీ గూబలవారిపల్లెలో దాత మోతుగూరి సోమశేఖర్ ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను, పేరయ్యగారిపల్లెలో ఏర్పాటు చేసిన టీడీపీ పార్టీ కార్యాలయంను జిల్లా టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని, ఎమ్మెల్సీ దొరబాబుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మల్లారపల్లె గిరిధర్‌బాబు, కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ జడ్పీటీసీ ఎం.లత, మాజీ ఎంపీపీ శాంతమ్మ, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదన్‌నాయుడు, నాయకులు కోదండయాదవ్, కొల్లా రమేష్‌లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయకత్వం ఎంతో అవసరం



**గంగవరం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** విభజన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రాజకీయ మేధావి చంద్రబాబునాయుడు నాయకత్వం ఎంతో అవసరం ఉందని మండలాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడు, ప్రధానకార్యదర్శి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మురళీ, మాజీ ఎంపిటిసి రహీమ్‌భాషాలు పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను స్థానిక పోలీస్ స్టేషన్ పక్కన మాజీ సర్పంచ్ మురళీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. మరలా చంద్రబాబునాయుడు నాయకత్వం తోనే ఈ రాష్ట్ర ప్రగతి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నబ్బ, వసరాయగౌడు, సూరి, రవి, బాలక్రిష్ణ, లోకేష్, మొగిలిరెడ్డి, ప్రసాద్‌నాయుడు, ఆనందనాయుడు, యుగంధర్, గోవర్ధన్, సత్య, చంద్రప్పలు పాల్గొన్నారు.

## యన్‌టిఆర్ ట్రస్ట్‌చే మెగా ఉచిత వైద్యశిబిరం

**గుడుపల్లి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు సందర్భంగా మండల కేంద్రంలోని రాళ్లగంగమాంబ దేవాలయం దగ్గర కేక్‌కట్ చేసి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలకు రంజాన్ తోపాను పంపిణీ చేశారు. ఈసందర్భంగా యన్‌టిఆర్ ట్రస్ట్‌చే ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది మండలంలోని మారుమూల గ్రామాల నుండి సైతం ప్రజలు తరలివచ్చి పరీక్షలు చేయించుకున్నారు. ఈకార్యక్రమంలో నేతలు చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, పి.యస్ మునిరత్నం, బాబు నాయుడు, చంద్రశేఖర్, మునిరాజు, హేమాంబర్‌గౌడు, బేటప్ప నాయుడు, సుబ్బు తదితర నేతలు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పేదలకు దుస్తులు పంపిణీ



**నాయుడుపేట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** నాయుడుపేట పట్టణంలోని సుమారు వెయ్యిమంది పేదలకు 786 సేవా సంఘం ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. గురువారం 786 సేవాసంఘం అధ్యక్షులు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ రఫీ నివాసంలో సుమారు వెయ్యిమందికి దుస్తులు పంపిణీ చేశారు. రఫీతో పాటు ఆయన మిత్రులు గౌస్‌లు పేదలకు దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మౌలాన అబుబకర్, ముత్తవల్లి హాజీ రహమతుల్లా సాహెబ్, కమిటీ సభ్యులు నిజామ్, సుభాన్, పటేల్, షరీఫ్, ఫిరోజ్, రియాజ్ తదితరులు ఉన్నారు.

## విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబునాయుడు

-మాజి ఎంఎల్ఎ కురుగొండ్ల రామకృష్ణ



**వెంకటగిరి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** మంచి విజన్ ఉన్న నేత మాజి సిఎం చంద్రబాబునాయుడని మాజి ఎంఎల్ఎ కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నార చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భగ గురువారం కురుగొండ్ల నివాస గృహంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిఎంగా చంద్రబాబు తెలుగు రాష్ట్రాలను ఎంతగానో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. 2024 సంవత్సరంలో ప్రజలే వైసిపి తగు గుణపాఠం చెపుతారని తెలిపారు. ఎంపిడిఒ కార్యలయం కూడలిలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యర్యక్రమంలో మాజి ఎఎంసి ఛైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు, పార్టీ అధ్యక్షులు చంద్రమౌళిరెడ్డి, గంగాదర్, కొటేశ్వరరెడ్డి, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు కేవికే ప్రసాద్ నాయుడు, సుధాకర్, కాప శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని దానాల కన్న రక్తదానం మిన్న

**వెంకటగిరి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**



అన్ని దానాలకన్నా ర్తదానం మించింది లేదని డాక్టర్ మస్తాన్‌యాదవ్ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్, టిడిపి నేత డాక్టర్ బొలిగల మస్తా న్ యాదవ్ తెలిపారు. మాజి సిఎం నార చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భగా ట్రస్టు కార్యలయంలో కేక్‌కట్ చేసి ,రక్తదాన శిబిరం, అన్న దానం నిర్వహించారు. మాజి సిఎం నార చంద్రబాబునాయుడు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఎంతగానో కృషిచేసినట్లు తెలిపారు. కొత్తగ ఏర్పడిన నవ ్యంధ్ర ప్రదేశ్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ముందు చూపు కల్గిన నేత అని తెలిపారు. 2024 సంవత్సరంలో సిఎం అవుతారని తెలిపారు. చంద్రబాబునాయుడు తోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. మాజి ఎంపిటిని రామచంద్రయ్య, సిసింద్రి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలు

**బాలాయపల్లి, ఏప్రిల్20 ప్రభాతవార్త :** మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడి జన్మదినం సందర్భగా బాలాయపల్లిలో టిడిపి నేతలు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగ మాజి మండల పార్టి అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు మాట్లాడుతూ చంద్రబాబునాయుడుసిఎంగాతెలుగురాష్ట్రాలనుఎంతగానోఅభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు కొర్రపాటి రామచంద్రనాయుడు, రాయి సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు



**వాకాడు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** టీడీపీ అధినేత రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 73వ జన్మదిన వేడుకలు గురువారం మండలం టిడిపి కన్వీనర్ మధు రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని అశోక్ పిల్లర్ సెంటర్ వద్ద మండల టిడిపి కార్యావర్గం, అభిమానులు, పక్షంలో భారీ భర్తడే కేకును కట్ చేసి పంచి పెట్టారు. చంద్రబాబు నాయుడు నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పాలు పండ్లు పంపిణీ చేసి, పార్టీ కార్యకర్తలు , నాయకులు రక్తదాన శిబిరం కార్యక్రమంలో భారీ స్థాయిలో రక్తదానం చేశారు. ఈ జన్మదిన వేడుకల్లో మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, మామిడి గోవిందయ్య, మాజీ జడ్పిటిసి ప్రమీల, ప్రసంత్, శ్రీహరి, దయాకర్, తీపులపూడి రమణయ్య, అన్నమేటి చంద్రయ్య, గూడూరు సుధాకర్ రెడ్డి, కుంబాల రమణయ్య, రౌతు రమణయ్య, కోడివాక వెంకటేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ సిఎం జన్మదిన వేడుకలు



**చిట్టమూరు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని గురువారం టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు 73వ జన్మదిన వేడుకలను చిట్టమూరు మండల టిడిపి కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిట్టమూరులో టిడిపి నాయకులు, కార్యకర్తలు నెల్లూరు రోడ్డు క్రాస్ సంస్థ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కిషోర్ నాయుడు మాట్లాడుతూ ప్రతి టిడిపి కార్యకర్త చంద్రబాబు నాయుడు అడుగుజాడల్లో పనిచేసి 2024వ సంవత్సరంలో మరలా ఈ రాష్ట్రానికి అభివృద్ధిని చూపించే ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేయాల్సి న బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని 73 సంవత్సరాలు వయసులో కూడా ఈ రాష్ట్ర ప్రజల అభివృద్దే ధ్యేయంగా పని చేస్తున్నారని ఏనాడు తన స్వార్ధ ప్రయోజనాల కోసం చంద్రబాబు నాయుడు రాజకీయాలు చేయలేదని ప్రతి టిడిపి కార్యకర్త ఆయనను ఆదర్శంగా తీసుకుని సైనుకులాగా పని చేయాలని అన్నారు. ఈ మండల టిడిపి నాయకులు మారం రెడ్డి, జనార్ధన్ రెడ్డి, మల్లాం మాజీ సర్పంచ్ కామిరెడ్డి, సునీల్ రెడ్డి, ఈశ్వరయ్య, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి గుంపర్ల చిన్నారావు, ఎస్సీ సెల్ నాయకులు మండల బీసీ సెల్ నాయకులు, కాపులు చెంచురామయ్య, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో చంద్రబాబు జన్మదిన వేడుకలు

**సూళ్లూరుపేట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**



సూళ్లూరుపేట పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బర్త్‌డే కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నెలవల సుబ్రహ్మణ్యం, పరసారత్నం, వేనాటి సతీష్‌రెడ్డి, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, కొక్కు శంకరయ్య, ఆకుతోట రమేష్, చిట్టేడి పెరుమాళ్ళు, కె.పెంచలయ్య, దంతల రవి, మెస్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన ధనంజయరెడ్డి

**కోట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**



వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు కొడవలూరు ధనంజయరెడ్డి గురువారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

## తడ దేశం కార్యకర్తలు సుశిక్షితులైన సైనికులు

– నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ నెలవల



**తడ, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** తడ మండలంలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు సుశిక్షితులైన సైనికులని సూళ్లూరుపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం ఆయన తడలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు 73వ జన్మదినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. స్థానిక బజారు సెంటర్‌లో భారీ కేకు కట్ చేసి చంద్రబాబు, లోకేష్‌లకు జైకొట్టారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ తడ మండలంలోని పార్టీ కార్యకర్తలు ఎప్పుడూ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తున్నారని కొనియాడారు. మాజీ జడ్పిటిసి బొమ్మన్ శ్రీధర్, పార్టీ మండల కార్యదర్శి ఆర్.నీలకంఠంతో పాటు సీనియర్ నాయకులు కెవి రెడ్డి, యుగంధర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, టికె శ్రీనివాసన్, సుదర్శన్‌రావు, సెల్వం, జీవా, శివాజీ, పళణి, వల్లం విజయమ్మ, శకుంతలమ్మ, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబునాయుడు తిరిగి సీఎం కావాలి



**కోట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** నాలుగేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి లేక ఇతర రాష్ట్రాల కంటే ఎంతో వెనుకబడి ఉందని, ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి అభివృద్ధి వైపు నడిపించాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని తిరుపతి పార్లమెంటు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ అన్నారు. గురువారం కోటలో చంద్రబాబునాయుడు 73వ జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి, నాయకులు నాయబ్ రసూల్, నౌషాద్, షంషుద్దిన్, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ మస్తాన్‌బాషా, ఎంపిటిసి షంషుద్దిన్, సురేష్, షేక్ బాబు, వెంకటేశ్వర్లు, దువ్వూరు బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా మల్లికార్జునరావు

**కోట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** కోట మండలం తహశీల్దార్ పద్మావతి ఈ నెల 20వ తేదీ నుంచి మే 20వ తేదీవరకు సెలవులో వెళుతున్నారు. ఈ నేపథ్యంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా డిప్యూటీ తహశీల్దార్ మల్లికార్జునరావును నియమించినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## ఐకెపి కార్యాలయంలో పాము హల్‌చల్

**కోట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** స్థానిక ఐకెపి కార్యాలయంలో గురువారం జెర్రిపోతు రావడంతో ఒక్కసారిగా ఉద్యోగులు, మహిళలు భయాందోళనకు గురయ్యారు. కార్యాలయం నుంచి పరుగులు తీశారు. దీంతో పాములు పట్టే మౌలాను తీసుకొచ్చి ఆ పామును పట్టించారు. మౌలా చాకచక్యంగా ఆ పామును పట్టుకొని దూరంగా విడిచిపెట్టాడు.

## అదనపు ఛార్జీలు తగ్గించండి



**దొరవారిసత్రం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** ప్రభుత్వ ఉద్యోగులు తమ జీతాలు 1వ తేదీన రావడం లేదని, మాకు వెసులుబాటు కల్పించాలంటూ తిరుపతి జిల్లా ఏపీ జేఏసీ ఛైర్మన్ గోపీనాథరెడ్డి ఉద్యోగులతో సూళ్లూరుపేట స్టేట్‌బ్యాంకు మేనేజర్‌ను కలిశారు. సూళ్లూరుపేటలోని స్టేట్ బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తూ, తమకు రావాల్సి న జీతాలు సక్రమంగా రావడం లేదని, తాము తీసుకున్న రుణాలకు ఇఎంఐలు చెల్లింపులు ఆలస్యం కావడం వల్ల అదనపు ఛార్జీలు పడుతున్నాయని తెలిపారు. బ్యాంకు వారు ఉద్యోగులకు ఇఎంఐ తేదీలను మార్పుచేసి ఆదుకోవాలని వారు కోరారు. వీరితో పాటు పలువురు ఉద్యోగులు ఉన్నారు.

## వాటంబేడుకుప్పంలో మురుగన్ భక్తుల కోలాహలం



**తడ, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** తడ మండలం వాటంబేడు కుప్పంలో పులికాట్ జాలర్లు మురుగన్ మాలలు ధరించి వేడుకలు జరుపుకున్నారు. తమిళనాట సాంప్రదాయంలాగా ఆంధ్రా ప్రాంతంలోని పలుచోట్ల మురుగన్ మాలలు ధరించడం ఆనవాయితీ. నియమ నిష్టలతో ఈ మాలలు ధరించి తమిళనాడులోని వివిధ సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలకు వెళుతుంటారు. ఇందులో భాగంగా వాటంబేడుకుప్పంలో జాలర్లు తిరునాళ్లలాగా గ్రామాన్ని అలంకరించుకొని భజనలు, ప్రత్యేక అలంకరణలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా మురుగన్ భక్తులు అగ్నిగుండం కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా చంద్రబాబు జన్మదినం

**గుడిపాల, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు జన్మదినంను గురువారం మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో దేశం నాయకులు అనిల్‌కుమార్, చంద్రమోహన్, గోళ్ళహేమాద్రినాయుడు, అరుణ్‌కుమార్, శంకర్‌కుమార్, ప్రకాష్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చంద్రబాబు జన్మదినం



**పాలసముద్రం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మది నోత్సవంను జిడినెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ దేశం ఇన్‌ఛార్జి భీమినేని చిట్టిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం నాయకులు ఎం.శేఖర్‌రాజు, వాసునాయుడు, విజయ్‌కుమార్, అరుళ్‌నాధన్, అవినాష్, వెంకటేశులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యాసామాగ్రి అందజేత



**పాలసముద్రం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** పాఠశాలలో సుదీర్ఘంగా ఉపాధ్యాయుడుగా సురేంద్రరెడ్డి విధులు నిర్వర్తించి విద్యార్థులకు విద్యాబోధన చేసిన తండ్రి జ్ఞాపకార్థం తనయుడు రాజేష్ అలియాస్ ఢిల్లీబాబు గురువారం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందజేశారు. మండలంలోని ఆముదాల పంచాయతీ కావేరిరాజపురం ప్రాథమిక పాఠశాలలో సురేంద్రరెడ్డి 15 సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడిగా సేవలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ జయలక్ష్మి, ఉపాధ్యాయులు వాసునాయుడు, భక్తవత్సలం నాయుడు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈదుల్ ఫితర్ నమాజులు మూడు చోట్ల మాత్రమే!

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 20 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో పవిత్ర రంజాన్ సందర్బంగా ఈదుల్ ఫితర్ ప్రార్ధనలను మూడు చోట్ల నిర్వహించనున్నట్లు మసీదుల్లో ప్రకటించారు. శ్రీకాళహస్తి-పిచ్చాటూరు మార్గంలోని రాజీవ్ నగర్ ఈద్‌గాహ్ వద్ద ఉదయం 7.30లకు, ఈదులగుంట ఈద్‌గాహ్ నందు ఉదయం 8.30గంటలకు అయ్యలనాడు చెరువులోని ఈద్‌గాహ్‌లో 9గంటలకు ఈదుల్ ఫితర్ ప్రార్ధనలు చేపట్ట బడుతుందని నిర్వాహకులు వివరించారు. కాగా ఈదులగుంట ఈద్‌గాహ్‌లో ఏర్పాట్లును జామియా మస్‌జిద్ ముతవల్లి అక్రమ్‌సాహెబ్, అయ్యల నాడు చెరువులో ఏర్పాట్లను మక్కామస్‌జిద్ ముతవల్లి అబీద్ హుస్సైన్‌ల కమిటీలు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే అక్కడ చదునుచేయు కార్యక్రమాలను చేపట్టారు. ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది కాబట్టి షామియానాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రకటించిన సమయం మేరకు నమాజులు చేపట్టబడుతుందన్నారు.

## రంజాన్ మాసం ఎంతో పవిత్రమైంది -నిరుపేదలకు చీరల పంపిణీ

తొట్టంబేడు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త



రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని మండలంలోని రామ చంద్రా పురం గ్రామ వైఎస్ఆర్‌సిపి కన్వీనర్ షేక్.మహబూబ్‌బాషా అన్నారు. ప్రతి ఏడాది 30రోజుల పాటు ఎంతో నియమనిష్టలతో ఉపవాసాలు ఉండి అల్లాహ్‌ను ప్రార్ధిస్తే కోరిన కోరికలు నెరవేరు తాయని, అంతేకాకుండా ఆరోగ్యం కూడా బాగుంటుందని తెలి పారు. మస్‌జిద్‌లో ప్రార్ధనలు, ఉపవాసాలు పూర్తిచేసుకున్న అనంతరం గ్రామస్తులకు చీరలు, లుంగీలు, మరియు బిర్యానీ ప్యాకెట్లను పంపిణీచేశారు. ప్రతి ఏడాది తమవంతుసాయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో షరీఫ్, పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## పోటీ పరీక్షలతోనే విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపు..డిఎస్పీ

తొట్టంబేడు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త



పోటీ పరీక్షలతోనే విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించుకోవచ్చని శ్రీకాళహస్తి డిఎస్పీ ధర్మవరపు విశ్వనాధ్ అన్నారు. గురువారం ధర్మరాజులస్వామి ఆలయం ఎదురుగా ఉన్న శ్రీచైతన్య పాఠశాలబ్రాంచి-3 విద్యార్థులు ఒలంపియాడ్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనపరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఎస్‌పి మాట్లాడుతూ విద్యార్థుల్లో వారి సామర్థ్యాలను పెంచడానికి ఇలాంటి పోటీ పరీక్షలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో అన్ని విభాగాల్లో 120మంది విద్యార్థులు పాల్గొనగా 112మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం సంతోషమన్నారు. ఒక్క విద్యలోనే కాకుండా పోటీ పరీక్షలు, క్రీడలు ఇలా వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులను గుర్తించాలని ఉపాధ్యాయులను డిఎస్పీ కోరారు. ప్రధమ బహుమతి సాధించిన జి.సిరి, తృతీయ బహుమతి సాధించిన జి.అఖిల్, కె.ఆదిత్య, నాలుగవ బహుమతి సాధించిన కె.లాస్యలకు బంగారు పతకాలు, సర్టిఫికెట్లు అందించి డిఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఏజిఎం శ్రీనివాసులు, పాఠశాల ప్రిన్సిపల్ రమణ, తిరుపతి జోన్ అకడమిక్ కో ఆర్డినేటర్ బాలాజీ, డీన్ కేదార్, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంకాళమ్మ ఆలయం వద్ద అన్నదానం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త



పివిరోడ్డు నందు వెలసిన అంకాళమ్మ ఆలయం వద్ద గత ఏడాది నుంచి ప్రతి నెలా అమావాస్య రోజున మరాఠీ పాళెం వాస్తవ్యులు అయిన గోవర్ధన్‌రావు, యశ్వంత్ రావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యమాలు నిర్వహిస్తున్నారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఈనెల అన్నదానానికి సహాయసహకారాలు అందించిన క్రాంతి కుమార్, డాక్టర్ కృపానిధి, ఉపేందర్‌రెడ్డి, రాఘవేంద్ర, సావిత్రిబాయి, మాదవసాయి, సుశీలబాయి, బాలాజీరావు, గణేష్‌బాబు, వినీత్‌రెడ్డి, నాగేష్, బాబ్జీరావు, అనూష, షర్మిళ, శ్రీరాం, అరుణ్, శివకుమార్‌రెడ్డి, దిలీప్, మయూర్ ప్రసన్న, ధనుష్‌రెడ్డి, కార్తికేయన్, చేతలిశర్మ, జయంత్‌సింగ్, ఆనంద, లీలామోహన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సుమారు 200మందికి పైగా అన్నదానం నిర్వహించారు.

## నిరుపేదలకు ఎల్లప్పుడు అండగా ఉంటా..బొల్లినేని

.తొట్టంబేడు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త



నిరుపేదలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని రాచగున్నేరి మాజీ సర్పంచ్, రాజకీయనేత బొల్లినేని జగన్నాధంనాయుడు అన్నారు. గురువారం మండలంలోని ఇలగనూరు గ్రామంలో నివాసం ఉంటున్న రజక సామాజిక వర్గానికి చెందిన పోతుగుంట చంద్రయ్య కుమారుడు ఇటీవల కాలంలో ప్రమాదశాత్తు గంగ కాలువలో జారిపడి ప్రాణాలు పోగొట్టుకున్న సంగతి విదితమే. అయితే చంద్రయ్యకు షుగర్‌వ్యాధిలో బాధపడుతుండడంతో విషయం తెలుసుకున్న ఆయన చంద్రయ్య నివాసం వద్దకు వెళ్ళి ఆయనను పరామర్శించి తనవంతు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో అబ్బూరి పుల్లయ్యనాయుడు, దామినేటి మునిరెడ్డి, ఫతాన్ ఫజరుల్లాఖాన్, కూనాటి బత్తెయ్యయాదవ్, జగ్గరాజుపల్లి, రమేష్, చింతా బత్తెయ్య, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కర్మక్రియలు చేసుకునే స్థలం కబ్జా

తొట్టంబేడు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త



కొందరు నేతల భూదాహానికి అంతులేకుండా పోతోంది. మండలంలోని బసవయ్యపాళెం పంచాయతీ జ్ఞానమ్మకండ్రిగ చెరువు ఉంది. ఈ చెరువు కట్ట సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో దళితులు తరతరాలుగా కర్మక్రియలు కార్యక్రమం నిర్వహించుకునేవారు. ఇప్పటికీ ఈ స్థలం కర్మక్రియలు నిర్వహిస్తున్నారు. అయితే బసవయ్యపాళెంకు చెందిన అధికార పార్టీ నేతకు ఈస్థలంపై కన్నుపడింది. ఈస్థలంలో ఆనేత దగ్గర పనిచేసే వారికి ఇండ్లు నిర్మించాలని నిర్ణయించుకున్నాడు. ఎలాగూ పార్టీనేతల అండ దండలతో అనుకున్నదే తడవుగా జ్ఞానమ్మకండ్రిగ చెరువు వద్ద దళితులు కర్మక్రియలు చేసుకునే స్థలం చదును చేయించాడు. విషయం తెలుసుకున్న దళితులు అక్కడకు చేరుకుని అభ్యంతరం వ్యక్తం చేశారు. కర్మక్రియలకు వినియోగించే స్థలం ఆక్రమించవద్దని చెప్పినా సదరు నేత పట్టించుకోవడం లేదు. దీనిపై తహశీల్దార్ సుధీర్‌రెడ్డిని వివరణ కోరగా చెరువు స్థలం ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## రాష్ట్రాన్ని అభివృద్ధి పధంలో నడిపిన ఘనత బాబుదే

.తొట్టంబేడు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోనడిపిన ఘనత మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబునాయుడుదే అని మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు అన్నారు. గురువారం మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు 73వ పుట్టినరోజు వేడుకలను మండలంలోని చిన్నసింగమాల గ్రామంలో వెలసియున్న వీరభద్రస్వామి సన్నిధిలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు సూచనల మేరకు వీరభద్రస్వామి ఆలయంలో చంద్రబాబునాయుడు కుటుంబసభ్యుల పేరుపై స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేయించారు. అనంతరం చంద్రబాబునాయుడు గారి ఫోటోతో ఉన్న భారీకేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.మాజీ మండల పార్టీ అధ్యక్షుడు భాస్కర్‌నాయుడు, మాజీ ఎంపిటిసి మాధవయ్య, మంగారెడ్డి, గుర్రప్ప, బాలసుబ్రహ్మణ్యం భాస్కర్, కమల్‌నాథ్, మాజీ ఎంపిటిసి హైమావవతి శంకర్‌నాయుడు, చెరుకూరి శంకర్‌నాయుడు, పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి ప్రణాళికలు



శ్రీకాళహస్తిరూరల్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలోని బొక్కసంపాళెం పాఠశాల అభివృద్ధికి ప్రణాళికలురూపొందించి అమలు చేస్తామని ఎంపిటిసి గోవిందరెడ్డి, సర్పంచ్‌రేఖ తెలిపారు. పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.గురువారం పాఠశాలలో ప్రత్యేకపూజలు, ప్రార్ధనలు జరిపారు.ఈ సందర్భంగా నాయకులుమాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపు నిచ్చారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయు రాలు ప్రమీల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులను తీర్చి దిద్దటంలో తమ వంతు కృషి చేస్తున్నామని వివరించారు. మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం, తల్లిదండ్రులు కమిటి చైర్మెన్ రాజ్యలక్ష్మీ,క్లస్టర్ రిసోర్స్ పర్సన్ స్వప్న,ఉపాధ్యాయురాలుయశోదప్రజాప్రగతిట్రస్టువాలంటీర్‌తేజోవతి,అంగన్‌వాడిటీచర్‌ప్రియాంక, సహా యకురాలుఉమాదేవి.గంగోజమ్మ,విద్యార్థులుపాల్గొన్నారు.విద్యార్థులకుప్రోత్సా హకబహుమతులుఅందజేసా

## అమెనిటి కాంప్లెక్స్ పనులు పరిశీలించిన కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త



నగరంలోని కపిలతీర్థం కూడలి వద్ద స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న అమెనిటీ కాంప్లెక్స్ నిర్మాణ పనులను నగర పాలక సంస్థ కమిషనర్ హరిత బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థకు ఆదాయం వచ్చేలా సుమారు రెండు కోట్ల రూపాయిల నిధులతో నిర్మించడం జరిగింద న్నారు.పనులుపూర్తిఅయిన వెంటనే రెంటల్ ప్రాతిపదికన ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్‌మోహన్,మునిసిపల్‌ఇంజినీర్ చంద్రశేఖర్ , ఏఈ కామ్ ప్రతినిధి బాలాజీ, తదితర్లులు ఉన్నారు.

## 30 అడుగుల ఎత్తు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

**తిరుపతి క్రైం, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**తిరుపతిలోని రాయల్ నగర్ ఆరవ క్రాస్ రోడ్డు నందు పెయింట్ పని చేస్తూ సుమారు 30 అడుగుల ఎత్తు నుంచి నిర్మల్ (50) ఊరు తెలియని వ్యక్తి కింద పడి గాయాలపాలై మృతి చెందాడని తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రవీంద్రనాథ్, ఎస్ఐ అనితలు పేర్కొన్నారు. చనిపోయిన వ్యక్తి తిరుపతి కొర్లగుంట జంక్షన్‌లో ఉంటూ పెయింట్ కులీ పనులు చేసుకుంటూ ఉండేవాడు. చనిపోయిన వ్యక్తి యొక్క ఆచూకీ వివరాలు తెలియదు. ఎవరికైనా తెలిసిన ఎడల తిరుపతి ఎస్వి యూనివర్సిటీ ఇన్స్పెక్టర్ రవీంద్రనాథ్ 9491074524, ఎస్ఐ అనిత 6305014261 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

## మంత్రి రోజా నేతృత్వంలో నగరి సర్వతోముఖాభివృద్ధి

మునిసిపల్ ఛైర్మన్ హరి



పుత్తూరు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా నేతృత్వంలో నగరి నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి చెందుతోందని పుత్తూరు మునిసిపల్ ఛైర్మన్ అనంగి హరి తెలిపారు. పుత్తూరు మునిసిపాలిటీలో అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులు చేశా మని తెలిపారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు గంగ కాల్వ నుంచి ఎఐడిబి 300 కోట్లతో నగరి ప్రజల దాహార్తిని తీసుకువచ్చేందుకు మంచి నీటి ప్రాజెక్ట్ తీసుకువచ్చారని తెలిపారు. పుత్తూరులో రూ. 90 లక్షలు, రూ. 80 లక్షలతో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేయించారన్నారు. రూ. 1.10 కోటితో మునిసిపల్ పార్క్ నిర్మించామన్నారు. గోవిందమ్మ గుడి వద్ద రూ. 49 లక్షలతో మరో పార్క్ నిర్మిస్తున్నామన్నారు. రూ. 25 లక్షలతో ధర్మరాజుల గుడి గాలిగోపురం, రూ. 25 లక్షలతో కోనేరు నిర్మించారని వివరించారు. 23వ వార్డులో 30 లక్షలతో సిసి రోడ్డు నిర్మించామన్నారు. వందల మంది పేదలకు లక్షల రూపాయల ఖర్చుతో తమ నాయకురాలు రోజా ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించారని తెలిపారు. చంద్రబాబునాయుడు పూర్తి కాని పోలవరం ప్రాజెక్ట్ వద్దకు తన కార్యకర్తలను తీసుకెళ్లి సొంత భజన చేయించుకున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్ వి.ఎం.మాహీన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రం 30 ఏళ్ల ముందుకు వెళ్లిందని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నవరత్నాల పథకాలు అమలు చేస్తూ ప్రజల హృదయాల్లో జగన్మోహనరెడ్డి నిలిచిపోయారని తెలిపారు. సమావేశంలో మునిసిపల్ వైస్‌ఛైర్మన్ డి.శంకర్, పలువురు కౌన్సిలర్లు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## టిడిపి పట్టణ అధికార ప్రతినిధిగా జి.బాబు



**పుత్తూరు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ పుత్తూరు పట్టణ అధికార ప్రతినిధిగా జి.బాబును నియమిస్తున్నట్టు టిడిపి నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ గురువారం ప్రకటించారు. పట్టణంలో పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేయాలని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తనకు పదవి ఇచ్చినందుకు భానుప్రకాశ్‌కు జి.బాబు కృతజ్ఞతలు తెలిపారు. తనపై వుంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి పనిచేస్తానని తెలిపారు.

## ఆత్మీయ ముస్లీమ్ సోదరులకు "ఇఫ్తార్ విందు"

రోషన్ మజీద్‌లో " చెవిరెడ్డి మోహిత్ రెడ్డి" ప్రార్థన

చంద్రగిరి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:



ఆత్మీయ ముస్లీమ్ సోదరులకు పవిత్ర ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు వైసిపి ఎంఎల్ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక బీడి కాలనీలోని మసీదులో గురువారం రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముస్లీమ్ మతపెద్దలు, ముస్లీమ్ సోదరులతో కలసి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ పండుగ సుఖసంతోషాల నడుమ జరుపుకోవాలనే సదుద్దేశ్యంతో ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రంజాన్ తోఫా అందించడం జరిగిందన్నారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం అన్నారు. ఈ కార్యక్రమంలో మతపెద్ద షేక్ ఎతింషా వలీ, ఎంపిపి హేమేంద్రకుమార్ రెడ్డి, వైసిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు చేగు ప్రశాంత్ గుప్తా, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మస్తాన్, బహర్, కొత్తపాటి హరి, ఔరంగజేబు, సూరి, సోనూ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యమే పరమావధిగా..

చారిత్రాత్మక కార్యక్రమానికి చెవిరెడ్డి శ్రీకారం నియోజకవర్గంలోని ప్రజలకు ఉచిత రక్త పరీక్షలు

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు

చంద్రగిరి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:



చారిత్రాత్మక నేపథ్యం కలిగిన చంద్రగిరి నియోజకవర్గంలో ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చారిత్రాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని గురువారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు, డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న పాకాల మండలం, దామలచెరువు సచివాలయంలో ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజల ఆరోగ్యమే పరమావధిగా బృహత్తర కార్యక్రమానికి తెరతీశారన్నారు. అన్ని రకాల రక్తపరీక్షలతో పాటు ఈసిజి పరీక్షలు సైతం చేస్తారన్నారు. అత్యవసర వైద్య సేవలందించడానికి సైతం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఏరియా ఆసుపత్రిలోని అత్యాధునిక వైద్య పరికరాలను పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి, ఎంపిడిఓ రమేష్‌బాబు, తహశీల్దార్ శిరీషా, కమిటీ డైరెక్టర్ విరూపాక్షి మమత శంకర్ రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్, దంతవైద్య నిపుణులు డాక్టర్ శ్రీలక్ష్మి, ఆర్ఐ సులోచనమ్మ, హెడ్‌నర్స్ కళావతి, తదితరులు పాల్గొన్నారు.

## ముస్లీమ్ సోదరులకు చంద్రగిరి సర్పంచ్ ఇఫ్తార్ విందు

చంద్రగిరి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:



చంద్రగిరి గ్రామ పంచాయతీ సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి దంపతులు గురువారం ముస్లీమ్ సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని సర్పంచ్ దంపతులు స్థానిక కొత్తపేట, కోట గ్రామం, జెండామానువీధి, ఇందిరమ్మ కాలనీలోని మసీదుల వద్ద ముస్లీమ్ సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పవిత్రమైన మనస్సుతో ఈ మాసం పూర్తిగా ఉపవాస దీక్షలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. మన జీవన స్రవంతిలో భాగమై మన జాతీయతకు, సంస్కృతీ వికాసానికి, ఇటువంటి పండుగలు దోహదం చేస్తాయన్నారు. మసీదుల మతపెద్దలు జార్ బహర్, నన్నేసాహెబ్, రసూల్ భాషా, మహ్మద్ రఫీలకు, ముస్లీమ్ సోదరులకు వారు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## అన్నదానానికి రూ.లక్ష విరాళం

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 20 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలోనిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి మచిలీపట్టణానికి చెందిన శివభక్తులు రూ.లక్ష విరాళం అందించారు. ఇక్కడ నిర్వహిస్తున్ననిత్యాన్నదాన పథకానికి చెల్లించే విరాళాల మీద 80జి ప్రకారం ఆదాయపు పన్ను మినహాయింపు ఉంది. దాంతో భక్తులు భూరి విరాళాలను అందిస్తున్నారు.ఈ నేపధ్యంలో గురువారం మచిలిపట్టణానికి చెందిన కొట్టంలంక విచ్చేసారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆయన ఎఇఓ సతీష్‌మాలిక్‌తో విరాళం చెల్లించాలని కోరారు. ఆయన కు రూ.లక్ష చెక్కును అందించారు. ఈ కార్యక్రమాల్లో పిఆర్ఓ నాగభూషణంనాయక్ పాల్గొన్నారు.

## అవకాశం ఇవ్వండి .. అభివృద్ధి చేసి చూపుతాం..!



టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్

రామచంద్రాపురం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:

2024 సార్వత్రిక ఎన్నికలలో టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నానికి అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపుతామని టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్ అన్నారు. గురువారం రాయలచెరువు పేట గ్రామంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా భారీ కేక్‌ను కట్‌చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమంలో గడపగడపకు తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చినబాబు, జనార్ధన్ చౌదరి, ఉమాపతి నాయుడు, గిరిధర్ రెడ్డి, రావిళ్ళ గిరి, ముచ్చేలి ఢిల్లీనాథ్ రెడ్డి, వసంత నాయుడు, మాదవయ్య, నాగభూషణం, కోటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

**విజయపురం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**



మండలంలో టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పుట్టిన రోజు వేడుకలు గురువారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నా రు. ఈ సందర్భంగా విజయపురం పిహెచ్‌సిలోని రోగు లకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. అనంతరం కళియం బాకం, మిట్టకండ్రిగ, పన్నూరు నాలుగు రోడ్ల కూడలిలో కేట్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు సంపూర్ణ ఆరోగ్యంతో రాష్ట్ర ప్రజలకు మరిన్ని సేవలందించాలన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రానికి సుపరిపాలన అందించే అవకాశం 2024లో కల్పించాలని ప్రజలను కోరారు. వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్దం కావాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మణిరాజు, నాయకులు వేణుగోపాలనాయుడు, శివలింగం, గుణభూషణమ్మ, లక్ష్మీపతి, సుధానాయుడు, శివయ్యనాయుడు, గుణశేఖర్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, శరత్, కపిల్, గాలి రమేష్, మురళినాయుడు, పరంధామనాయుడు, పురుషోత్తం పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



వెదురుకుప్పం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :మాజీ ముఖ్యమంత్రి, తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా తెలుగు తమ్ముళ్ళు ఏవరికి వారే యమున తీరే చందంగా జరుపుకోవడం పై బహిరంగా విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ కార్యాలయంలో ఓ వర్గం జరుపుకుంటే, మరో గ్రూపు తమ్ముళ్ళు మండల కేంద్రం కూడలిలో జరుపుకోవడంపై తమ్ముళ్ళ ఐక్యతరాగంను చెప్పకనే చెపుతున్నదని పలువురు పార్టీ కార్యకర్తలు మదనపడుతున్నారు. వెదురుకుప్పం మండల తెలుగు తమ్ముళ్ళ తీరు గంగాధర నెల్లూరు సమన్వకర్త చిట్టి బాబు నాయుడుకు తలనొప్పిగా తయారైయిందని చెబుతున్నారు. చిట్టీ బాబు సమన్వయ లోపమా ? తమ్ముళ్ళ తీరు పార్టీకి శాపమా ? తెలియని ఆయో మయస్థితిలో క్షేత్రస్థాయి కార్యకర్తలలో నిరాశకు గురవుతున్నట్లు తెలుస్తోంది. జన్మదిన వేడుకల్లో పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు లోకనాధ రెడ్డి, నియోజకవర్గం మీడియా సమన్వకర్త గురసాల కిషన్ చంద్, నాయకులు నరసింహ యాదవ్, మునిచంద్రా రెడ్డి, వెంకటరమణ రెడ్డి, భాస్కర్ నాయుడు పాల్గొనగా కూడలిలో మాజీ జిల్లా కార్యదర్శి మోహన్ మురళి,కొండదరెడ్డి,గంగాయ్య, రవి పాల్గొన్నా రు.

## అంగన్‌వాడీ భవనాలు నిర్మించి ఆదుకోండి - జడ్పీటీసీ గాంధీ



**నగరి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** మా గ్రామ పరిధిలోని అర్హులకు అంగన్‌వాడీ భవనాలు నిర్మించి ఆదుకోవాలని నగరి మండల జడ్పీటీసీ గాంధీ విన్నవించారు. చిత్తూరులో జిల్లా పరిషత్ కార్యా లయంలో స్టాండింగ్ కమిటీ సమావేశం జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ గాంధీ మాట్లాడుతూ తడుకు దళితవాడలో 44 మంది, సుందరమ్మ కండ్రిగ గ్రామాల్లో 30 మంది చిన్న పిల్లలు అద్దె అంగన్‌వాడీ భవనాల్లో చదువుకుంటున్నారని తెలిపారు. కావున జడ్పీ నిధులు మంజూరుచేసిశాశ్వతఅంగన్‌వాడీభవనాలను నిర్మించాలని చైర్మన్‌కు వినతిపత్రం అందజేసి విన్నవించారు.

## టీడీపీ అధినేత చంద్రబాబు జన్మదిన వేడుకలు

వడమాలపేట,ఏప్రిల్ 20 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు 73వ పుట్టిన రోజు వేడుకలను పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించి కేక్‌కట్ చేసి నాయకులు, కార్యకర్తలు కోలాహలంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో దాముయాదవ్, ఉమాపతిరావు, శేషాద్రియాదవ్, ధనంజయలునాయుడు, లక్ష్మీప్రసన్న, వెంకటయ్య, హేమావతి, దేవా, రవిరెడ్డి, గురునాథం బాబు, రఘు,భాస్కర్‌నాయుడు,మోహన్,రాధాకృష్ణ,వినోద్,బాలకృష్ణ,వివేకానంద, చైతన్య, వేణు పాల్గొన్నారు.

## గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఆదిమూలం

**కేవీబీ పురం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలం రాయపేడు గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొన్నారు. జగనన్నసంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయా... లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగనన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని అలాగే అర్హత ఉండి పథకాలు అందని లబ్ధిదారులకు వెంటనే ఈ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం చిన్నారులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కేవీబీ పురం పోలీస్‌స్టేషన్‌లో సీఐ సురేష్, ఎస్ఐ సునీల్, పోలీసు సిబ్బంది చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఆ చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గర్భిణీలకు సీమంత ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హిస్టరి అకాడమి డైరెక్టర్ గవర్ల కృష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మి నందకుమార్, వైస్ ఎంపీపీ సరస్వతి శీను యాదవ్, జడ్పీటీసీ మూర్తి మునెమ్మ, సుబ్బయ్య, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ ఫైనాన్స్ డైరెక్టర్ వసంత లాల్ యాదవ్, ఏపీవోలు, పీవోలు, తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు గౌనిపురం రాము, ఏపీ మోడల్ స్కూల్ చైర్మన్ హరిబాబురెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ శాస్త్రిరాజు, రాయపేడు హరి నాగయ్య, జగదీష్, పర్వతాల ఎస్సీసెల్ అధ్యక్షులు అరుణ్, సర్పంచ్ బాలాజీ, ఎంపీటీసీ అయ్యప్పరెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు.

## పేదల సేవలోనే అల్లా ఉన్నాడు - ఎంఎస్ఆర్

రేణిగుంట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:



నిరుపేదలకు సేవ చేస్తే అల్లాకు సేవ చేసినట్లేనని తారక రామానగర్ వైసీపీ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి(ఎం ఎస్ఆర్) అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచా యతీ తారకరామానగర్‌లో రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ముస్లింసోదరులకు ఎంఎస్ఆర్ గురు వారం రంజాన్ తోఫా పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ అతి పెద్ద పండుగగా అభివర్ణించారు. కుల మతాలకతీతంగా అందరూ మమేకమై హిందు ముస్లిం తేడా లేకుండా పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కన్నయ్య, వార్డు మెంబరు సావిత్రమ్మ, తహసీన, షాహిదా, విజయలక్ష్మి, శోభారాణి, స్థానిక నేతల కృష్ణమూర్తి, వెంకటయ్య, రవీంద్ర, హరి, రమేష్, మహేష్, రాజేష్, జిలాని, కాలేషా, ఫోటో శీను, గుడి శీను, మధు, సూరి భాస్కర్, కిరణ్, చైత్ర, లక్ష్మీనారాయణ, మహేష్, అర్జున్,మహిళానేతలులోకేశ్వరిరెడ్డి,అమ్ములు,తులసి,సుధారాణి,లత,కవిత,జయంతిపాల్గొన్నారు.

## ఘనంగా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు

నింద్ర,ఏప్రిల్ 20 ప్రభాతవార్త:



గురువారం మండల కేంద్రంలోని నేతమ్స్ షుగర్ ప్యాక్టరీలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 73వ జన్మదిన వేడుకలు మండల టిడిపి అధ్యక్షులు పేరం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి దివంగతనేత యన్‌టి రామారావు వారసుడుగా ఆయన ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేసి ప్రజల మన్నన పొందారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర యస్‌సి ఉపాధ్యక్షులు ధశరథ వాసు,నాయకులు వెంకటేశ్వర్లు నాయుడు,గంగాధరంనాయుడు, పరదేశి, సుబ్బా రావు,మురళీనాయుడు,రామూర్తినాయుడు,గాలిరమేష్‌నాయుడు,రవినాయుడు,బాబుయాదవ్, మనోహర్ నాయుడు,జగన్,కోటీశ్వరరావు,క్రిష్ణయ్య,చక్రపాణినాయుడు,కుప్పానాయుడు,రమేష్‌పాల్గొన్నారు.

## నారాయణవనంలో మాజీ సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

నారాయణవనం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు 74వ జన్మదిన వేడుకలను గురువారం మండలకేంద్రంలోని నారాయణవనంలో ఘనంగా జరుపుకున్నారు. చంద్రబాబు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హెచ్ హేమలత పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసిన తర్వాత కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ పి గిరిబాబు, జిల్లా నాయకులు కెఎస్‌రవి, టిషణ్ముగం, సి.బాబు, టి.సుబ్రమణ్యం, కెఎస్.రవి, బి్ట.బాలసుబ్రమణ్యం, ఎన్ కందస్వామినాయుడు, కిలారి విజయకుమార్, కూల్‌డ్రింక్స్ రమేష్, కె వాసుదేవన్, ఎ.హరి, మాణిక్యంరెడ్డి, వేలురెడ్డి, పొన్నుస్వామియాదవ్, సి.వాసుదేవయ్య, సి.వాసుదేవయ్య, శరవణరెడ్డి, లక్ష్మణన్, కెఎస్ శేఖర్, దొరవేలురెడ్డి, దానివేలు, చంద్రబాబు. సుబ్రమణ్యం, ప్రేమ్‌కుమార్, నరేష్, మణిరెడ్డి, లత, శాంతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

కేవీబీ పురం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:

కేవీబీ పురం సాయిబాబా గుడి వద్ద గురువారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 73వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. సుమారు 500 మందికి ఉచిత భోజనం అందించారు. కేవీబీ పురంలో, ఎంఏ రాజులకండ్రిగలలో చంద్ర బాబు భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రామానుజ నాయుడు, గోపినాథ్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు శివరావ్, టీడీపీ రాష్ట్ర బీసీ సంఘం నాయకుడు మొగిలి మునస్వామియాదవ్, అవసరం సురేష్‌రెడ్డి, గంగారెడ్డి, పరందామరెడ్డి, సాయి, రాజులకండ్రిగ సర్పంచ్ వెంకటేశ్వరులు, రాయపేడు సర్పంచ్ పన్నూరు బాలాజీ, చంద్రయ్య, మాజీ ఎంపీపీ మని నాగ రాజు,శోభన్‌బాబు,రవి,మాధవరెడ్డి,మురగారెడ్డి,కేశవులనాయుడు,పరశురాముడు,మునికృష్ణ,పాల్గొన్నారు.

## వైసిపి పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి... గాలి భానుప్రకాశ్

పుత్తూరు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :



వైసిపి పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ అన్నారు. గురువారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో జరిగిన పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు జన్మదినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో నాశనమైన రాష్ట్రాన్ని బాగు చేయడం ఒక్క చంద్రబాబుకే సాధ్యమని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, నగరి బాగుపడాలన్నా ప్రజలు తెలుగుదేశం పార్టీని గెలిపించాలని అందుకు ప్రజలు తమకు పూర్తి మద్దతు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, చిత్తూరు పార్లమెంట్ బసి సెల్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి, టిఎన్‌టియుసి అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు డి.ఎస్.గణేష్, సొరకాయలరాజు, మైనార్టీ నాయకుడు ఖాజా పీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓజిలిలో మిన్నంటిన బాబు జన్మదిన సంబరాలు



ఓజిలి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త : తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు గురువారం ఓజిలి బస్టాండ్ సమీపంలో ఓజిలి మండలం తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు జి. విజయ్ కుమార్ నాయుడు ఆధ్వ ర్యంలో తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. తమ అధినేత 73వ జన్మదినాన్ని పురస్కరించుకుని టిడిపి శ్రేణులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు జి. విజయ్ కుమార్‌నాయుడు మాట్లాడుతూ నవ్యాంధ్ర రూపశిల్పి, అమరావతి స్వాప్నికులు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సృష్టికర్త, కార్యకర్తల గుండె చప్పుడు, తెలుగు ప్రజల శ్రేయస్సు కొరకు అహర్నిశలు శ్రమించే నేత చంద్రబాబు హయాంలో జరిగిన అభివృద్ధి చేపట్టిన సంక్షేమ పథకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు, ఉపాధ్యక్షులు దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి, మైనారిటీ జిల్లా అధ్యక్షులు షేక్ ఖలీల్, ఎస్సి సెల్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు కంకణాల వరప్రసాద్ నాయుడు, ముస్లీం మైనారిటీ మండల అధ్యక్షులు షేక్ అల్లాబక్షు, ఎస్సి సెల్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రకాష్ నాయుడు, తిరుపతి పార్లమెంట్ బిసి సెల్ కార్య నిర్వాహకులు పాడి వెంకట సుబ్బయ్య, శ్రీనివాసులు, సుధాకర్ రెడ్డి, ఓజిలి వెంకటయ్య, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పేరం శెట్టి నాగయ్య, మోహన్ రాజు, పేరం శెట్టి, ధనుంజయ్య, కె. నారాయణ, పురుషోత్తం రాజు, యువ నాయకులు కోటి, సుబ్రమణ్యం రాజు, శ్రావణ్ బాబు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సమైక్య ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రధాత సమైక్య ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు 73వ జన్మదినం సందర్భంగా పట్టణంలోని టిడిపి కార్యాల యంలో ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్‌కట్‌చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంపిణీచేశారు. అనంతరం పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కంటారమేష్, చెంచయ్యనాయుడు, ప్రకాష్ నాయుడు, ప్రసాద్ నాయుడు, సుబ్బయ్య, గోపి, కాసరం రమేష్, రేణుకాదేవి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ముస్లిం మహిళలకు ఇఫ్తార్ విందు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త : రాష్ట్రంలో మైనారిటి ముస్లింలకు అండగా నిలిచింది, నిలి చేది వైకాపా ప్రభుత్వమేఅని శ్రీకాళహస్తి శాసన సభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఆయన తనయ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. శ్రీకాళ హస్తి మైనారిటి అభివృద్ది ఒక్క శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఎంతో చొరవ తీసుకుంటున్నారన్నారు. ఎంఎల్ఏ బియ్యపు మదుసూధనరెడ్డి మాట్లాడుతూ మైనారిటీ ముస్లింలకు నాడు డాక్టర్‌వైయస్‌రాజశేఖర్‌రెడ్డి విద్యా,ఉపాధి రంగాల్లో 4శాతం రిజర్వేషన్ కల్పించి ఉన్నత విద్యకుఅవకాశం కల్పించారన్నారు.అలాగే ఉపాధి రంగంలో రిజర్వేషన్ కల్పించి ఉద్యోగ వకాశాలు కల్పించారన్నారు. ప్రతి ఏడాది రంజాన్ మాసంలో మైనారిటి ముస్లిం మహిళలకు 'ఇఫ్తార్' విందు అందించటం మైనారిటీలతో సన్నిహిత్వానికి నిదర్శనం అన్నారు. ఈకార్యక్రమాల్లో బియ్యపు పవిత్రారెడ్డి ప్రతి మహిళను పలకరిస్తూ 'ఈద్‌ముబారక్' చెబుతూ రాబోవు రంజాన్ ముస్లిం అందరికి మంచి ఫలితాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్బంగా ఇక్కడ ప్రార్థనలు జరిపారు.ఈ కార్యక్రమాల్లో పట్టణం మరియు మండలంలోని నాయకులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టండి

**- తడ మండల టిడిపి నాయకులు**



తడ, ఏప్రిల్ 20 ప్రభాతవార్త : సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఇటీవల అభివృద్ధి పనుల కన్నా వ్యక్తిగత విమర్శలపై దృష్టి పెట్టారని, అది మానుకుంటే మంచిదని తడ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొ న్నారు. గురువారం తడలో విలేఖరులతో వీరు మాట్లాడుతూ ఇటీవల సంజీవయ్య తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డిలపై విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు. వేనాటి కుటుంబం గత మూడు తరాలుగా అభివృద్ధి పనులు చేయడంలో ఒక బ్రాండ్‌గా గుర్తింపు పొందిందని వీరు చెప్పారు. వేనాటి సుబ్బారెడ్డి, ఆయన కుమారుడు మునిరెడ్డి ప్రజాప్రతినిధులుగా ఉన్నప్పుడు ఎన్నో వందల స్కూళ్ల కట్టించారని, ప్రస్తుత వైసీపీ నాయకులు ఇది గుర్తుపెట్టుకోవాలన్నారు. వారి వారసుడుగా వేనాటి సతీష్‌రెడ్డి పార్టీలో కష్టపడి పనిచేస్తున్నారని, సతీష్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. టిడిపి నాయకులు బొమ్మన్ శ్రీధర్, పళణి, ఆర్.శివాజీ, నీలకంతం, సుదర్శనరావు, సుందరం, సెల్వం, జీవా, సుధాకర్ తదితరులు ఉన్నారు.

## ప్రజాప్రతినిధులు అంటే అంత అలుసా..?

**-సిడిపిఒపై జడ్పీచైర్మన్ ఆగ్రహం.. శాంతిపురం మండల మీట్**

శాంతిపురం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త : ప్రజాప్రతినిధులు అంటే అంగన్‌వాడీ వర్కర్లు, సిడిపిఒకు అంత అలుసా అంటూ జడ్పీచైర్మన్ శ్రీనివాసులు కుప్పం సిడిపిఒ అరుణశ్రీపై ఆగ్రహించారు. గురువారం ఎంపిపి వసు ంధర కోదండరెడ్డి అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు కొన్ని సక్రమంగా జరగడం లేదని గర్భిణులకు సరుకులు అందించడం లేదని సర్పంచులు ముక్తకంఠంతో పేర్కొన్నారు. అంగన్‌వాడీలపై గుడుపల్లె మండలంలో సైతం తనకు ఫిర్యాదులు అందాయన్నారు. సిడిపిఒ కుప్పంలో కూర్చుని వ్యవహరిస్తే చాలదని అప్పుడప్పుడు కేంద్రాలు తనిఖీ చేయాలన్నారు. సిడిపిఒ పనితీరు సక్రమంగా లేదని పేర్కొంటూ అవసరమైతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి సస్పెండ్ చేయిస్తానన్నారు. సిఎంకు చెడ్డపేరు తెస్తే సహించేది లేదన్నారు. కర్ణాటకనుంచి వచ్చే ఆధార్‌కార్డులు మార్చరాదని జడ్పీచైర్మన్ ఆదేశించారు. రైతుల భూములు దేవదాయశాఖలో నమోద య్యాయని వాటిని రెవెన్యూ అధికారులు మార్చకుండా రెండు లక్షలు డిమాండ్ చేశారని మొరసనపల్లి సర్పంచ్ జగదీష్ తెలిపారు. ఒటిఎస్ ద్వారా పదివేలు కట్టించుకుని పట్టాలు ఇవ్వలేదని సభ్యులు వాపోయారు. మంచినీటి సమస్య పరిష్కారంకు నూతన బోర్లు వేస్తామని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ తెలిపారు. మండలంలో ఉపాధిహామీలో చేపట్టే పనులు తెలియడం లేదని సభ్యులు పేర్కొన్నారు. రైతులు పంట నమోదును ఆర్‌బికెల్లో తప్పక నమోదు చేయాలని ఎఒ అప్పోజి తెలిపారు. సమావేశంలో జడ్పీటిసి శ్రీనివాసులు, వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ పెద్దన్న, మునిరత్నం గౌడు, నిసార్, ఎంపిడిఒ హేమమాలిని, తహశీల్దార్ లోకేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి బొజ్జల ఎంతో కృషి చేసారు : బొజ్జల

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మైనారిటి ముస్లింల సమాజాభివృద్ధికి దివంగతనేత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఎంతో కృషి చేసారని బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మైనారిటిముస్లింలకు 'ఇఫ్తార్ విందు' అందించారు. ఆయన మాట్లాడుతూ 'మైనారిటిలంటే మెజారిటి' శ్రీకాళహస్తిలో మైనారిటీలు బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి సహకరించారన్నారు. ఏం అభివృద్ధి చేసామనేది మైనారిటి ముస్లిం నాయకులకు తెలుసునన్నారు. 'గోరంత సహాయం చేసికొండంత ప్రచారం చేసుకోవటం మా కుటుంబానికి' తెలియదన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని మైనారిటి ముస్లింలు రెండు పండగల సందర్బంగా నమాజులు చేసుకోవటానికి సరైన స్థలం లేనందువల్ల ఈదుల గుంట, అయ్యలనాడు చెరువుల్లో ఐదేసి ఎకరాలుస్థలం కేటాయించారన్నారు. అలాగే ఏర్పేడుమండలం పాపానాయుడుపేటలో కేటాయిం చారన్నారు. అలాగే మసీదుల అభివృద్ధికి నిధులు సాధించి ఇచ్చారన్నారు. అంతేకాకుండా షాది మహల్స్‌ను నియోజకవర్గంలో నాలుగు నిర్మించటానికి నిధులు సమకూర్చారన్నారు.ఇలా సామాజికాభివృద్ధియే లక్ష్యంగా ఆయన పని చేసారన్నారు. ఇక 1994లో గృహనిర్మాణాలు ప్రారంభం కాగా పట్టణంలోని నిరుపేద మైనారిటీలకు మొదటి ప్రాధాన్యత కల్పించారన్నారు.



**ప్రార్థనలు చేసిన నాయకులు:**

ముస్లింలకు ఇఫ్తార్‌విందుసందర్బంగా పార్టీ కార్యాలయంలోగురువులతో ప్రార్థనలు చేసారు.దువా చేసారు. అంతా మంచి జరగాలని అల్లాహ్ వద్ద దువా చేసారు. తరువాత రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మైనారిటి ముస్లిం రాష్ట్ర కార్యదర్శి షాకిర్ అలి,జీలానిబాషా,షఫీ అహమ్మద్, ఖాదర్‌బాషా,ఖాదర్,బషీర్, మహమ్మద్,మీర్జావలి,అస్మత్, రఫీ,మస్తాన్ తెలుగుదేశం నాయకులు పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్,చెంచయ్యనాయుడు,రాంబాబు నాయుడు,సత్రవాడ ప్రవీణ్,ప్రకాష్‌నాయుడు,హరి, మునిరాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చంద్రన్న పుట్టిన రోజు పండగ

**- పెద్ద ఎత్తున అన్నదానం..**
**- ఆలయాల్లో పూజలు**



కుప్పం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త : తెదేపా అధినేత, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు 73వ జన్మదిన వేడుకలను కుప్పం నియోజకవర్గంలో తెదేపానేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్న దానాలు, ఆలయాల్లో పూజలు, గ్రామగ్రామాన కేక్ కటింగ్ కార్యక్రమాలను నిర్వహించారు. కుప్పంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో బాబు పేరిట ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం బస్టాండులో దివంగత ఎన్టీఆర్ వి గ్రహంకు నివాళులు అర్పించి భారీ కేక్‌ను తెదేపా నేతలు కట్ చేసి కార్యకర్తలకు పంచారు. అన్న క్యాంటీన్ ద్వారా వెయ్యి మందికి అన్నదానం చేశారు. కుప్పం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పాలు, పళ్లు పంచారు. కుప్పం ఆర్ఎస్ పేట మర్కస్ మసీదులో సాయంత్రం ఇఫ్తార్ విందు ఇచ్చారు. అంతకుముందు నేతలు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల కోసం అహర్నిశలు పాటు పడే వ్యక్తి అని ఆయన ఆయురా రోగ్యాలతో ఉండాలని ఆకాం క్షించారు. మరలా సిఎంగా చంద్రబాబు గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, చంద్రబాబు కార్యదర్శి మనోహర్, రాష్ట్ర నేత గోపీనాథ్, పరిశీకుడు గాజుల ఖాదర్ బాషా, నేతలు ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్, సాంబశివం , డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, శాంతారాం , కౌన్సిలర్లు సోమశేఖర్, వేలు,జాకీర్, త్రిలోక్,మంజునాథ్, ఆర్‌ఆర్ రవి, ఆర్ముగం, కన్నన్, విసి మంజునాథ్,జెకె సంతోష్, ఎవి రవి, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు మణి, ఐటిడిపి బాలాజీ, ఐటిడిపి నరేష్, మైనార్టీ నేతలు సర్దార్, అన్సర్, మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

**కుప్పంరూరల్‌లో :** మున్సిపల్ పరిధి లక్ష్మీపురంలో 75 కిలోల భారీ కేక్‌ను దేశం నేతలు కట్ చేశారు. ఈ సందర్భంగా దాదాపు వెయ్యి మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో రవి, రాజు, మునిరత్నం, సురేష్, బాలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని వెండుగంపల్లి, కొటాలూరు, మల్లానూరు, అడవి బూదుగూరు, కంగుంది, మంకలదొడ్డి, చెక్కునత్తం, బంగానత్తం, ఉర్ల ఓబనపల్లి, కెడిపల్లి, చందం, గరిగచీనేపల్లి,నూలుకుంట, మొట్లచేను, పైపాళ్యం, గట్టప్పనాయనిపల్లి తదితర గ్రామాల్లో చంద్రబాబు జన్మదిన వేడుకలు పెద్ద ఎత్తున జరిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు రామచంద్ర, సంజీవరాజులు నాయుడు, సర్పంచులు ధనశేఖర్, రాజేంద్రన్, నేతలు తిరుపతి, విభూషణ్, జయరాంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురం : తెదేపా అధినేత చంద్రబాబునాయుడు 73వ జన్మదినంను శాంతిపురంలో దేశం నేతలు ఘనంగా జరిపారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద 73 కిలోల కేక్ కట్ చేశారు. చంద్రబాబు సిఎం కావడం తథ్యమని దేశం ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. అలాగే రాళ్లబూదుగూరులో చంద్రబాబు జన్మదిన వేడుకల సందర్భంగా అన్నదానం, ఆలయాల్లో పూజలు చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ్‌నాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, ఉయ్యాల జయరాంరెడ్డి, నాగరాజు, రమేష్, మణి, బసవరాజు, అనసూయ, సుగుణమ్మ, చంద్రకళ, సింగిరి శ్రీనివాసులు, రాజారెడ్డి, ఆంజనేయరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

## నేటి లేగ దూడలే రేపటి పాడి సంపద

**పశుసంవర్ధకశాఖా కార్యనిర్వహక అధికారి డాక్టర్ సుబ్రమణ్యం**

వెదురుకుప్పం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త : నాటి లేగ దూడలే రేపటి భవిష్యత్తు పాడి సంపదని, వాటి పోషణకు మెలుకువలు పాటించడం వలన బలవర్ధక, శక్తి వంతమైన పాడి సంపదను పెంచుకోవచ్చని తిరుపతి పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహక అధికారి డాక్టర్ సుబ్రమణ్యం పేర్కొన్నారు. మండలంలోని మాంబేడులో గురువారం జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా లేగ దూడల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు చక్కగా పేయదూడలను పెంచుకోవడం వలన భవిష్యత్తు పాడి సంపద కొరకు అధిక వ్యయం చేయవలసిన అవసరం రాదని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి సభ్యులు బండి గోవర్ధన్ రెడ్డి, పుత్తూరు డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ గోవిందయ్య, వెదురుకుప్పం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఉమామహేశ్వరి, పశువైద్యాధికారులు డాక్టర్ రాజేష్, డాక్టర్ నాగేంద్ర రెడ్డి,పంచాయితీ కార్యదర్శి సుబ్రమణ్యం, సిబ్బంది మధు,శ్రీవిద్య, నందిని,పాడిరైతులులు పాల్గొన్నారు.

## బిజెపి ధర్నాతో వెనక్కు తగ్గిన స్విమ్స్ యాజమాన్యం

**-ఉద్యోగాల నోటిఫికేషన్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన డైరెక్టర్**



తిరుపతి ప్రెస్‌క్లబ్,ఏప్రిల్ 20 ప్రభాతవార్త: స్థానిక స్విమ్స్‌లోని 142 పోస్టులకు గాను ఉద్యోగాల భర్తీకి ఈనెల 15న యాజమాన్యం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం విధితమే.అయితే అందులో 3 పోస్టులు బిసి–ఇ కింద అన్యమతస్తులకు(ముస్లింలు) కేటాయిం చడాన్ని వ్యతిరేకిస్తూ బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జి.భానుప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం స్విమ్స్ ఆసుపత్రి ముందు నేతలు ధర్నాకు దిగారు.ఈ సందర్భంగా భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ తాజాగా స్విమ్స్‌లో విడుదల చేసిన నోటిఫికేషన్‌లో టిటిడి యాక్ట్ 30 ఆఫ్ 1987 కు వ్యతిరేకంగా యాజమాన్యం వ్యవహరించించడం దుర్మార్గమన్నారు.టిటిడి నిధులతో నడిచే ఆసుపత్రిలో వంద శాతం హిందువులేవైద్య సిబ్బందిగా పనిచేయాలన్నారు. మైనార్టీల ఓటు బ్యాంకు కోసం బిసిలకు అన్యాయం చేయడం ఎంతవరకు సమంజ సమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నేతలు సామంచి శ్రీనివాస్,వరప్రసాద్, అజయ్‌కుమార్, ముని సుబ్రహ్మణ్యం,శేఖర్,విశ్వనాథ్,జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ వైద్యం నిధులెక్కడివి..?

**ఎన్నిక వేళ రాజకీయం .. గమనిస్తున్న ప్రజలు-చంద్రబాబు జన్మదిన వేడుకల్లో "పులివర్తి నాని"**



చంద్రగిరి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గంలో ఇంటింటికీ వైద్యం నిధులెక్కడివంటూ టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని నిల దీశారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు 73వ జన్మదిన వేడుకలు గురువారం ఘన ంగా నిర్వహించారు. ఆయన కేక్‌కట్ చేసి, పార్టీ నాయకులతో అన్నదానం జరిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల వేళ రాజకీయాలను ప్రజల గమనిస్తున్నారని అన్నారు. ఇంటింటికీ వైద్యం కోసం చేయనున్న వ్యయం తుడా నిధులా, ప్రభుత్వ నిధులా, సొంత నిధులా చెప్పాలంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో అన్ని రంగాలు కుదేలయ్యాయన్నారు. నవరత్నాలు పేరిట కొందరికి ప్రయోజనం కల్పించి, అనేక మందిని తొలగిస్తు న్నట్లు దుయ్యబట్టారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరల పెంపును తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, టిడిపి మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు లంకెళ్ళ లలిత, టిడిపి గల్లా యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సక్కుర్ ధనంజయ రెడ్డి, నాయకులు గిరిధర్ రెడ్డి, దుబాసి రామమూర్తి, శ్రీహరి నాయుడు, కన్నయ్య నాయుడు, శానంబట్ల తులసి రెడ్డి, మండలం లోకేష్ రాయల్, మంగాపురం భాస్కర్ రాయల్, అమ్ములు, చెంగల్రాయులు ఆచ్చారి, తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ చేసిన స్థానాల్లో చేరాలని వత్తిడి

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో బదిలీల ప్రక్రియ రభసగా మారింది.మూడు రోజుల ముందు ఆలయంలో సామూహిక బదిలీలు చేపట్టారు.అయితే ఈ బదిలీల్లో పారదర్శకత కొరవడిందనే విమర్శలు చోటుచేసుకున్నాయి. కానీ తమ ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని ఎవరికి ఎక్కడకు బదిలి చేసామో అక్కడ బాధ్యతలు స్వీకరించాలని కార్యాలయంనుంచి వత్తిడి పెరిగింది.అయితే స్థానిక ఆలయంలో అర్చకులు కొన్నినిబంధనలను పాటిస్తారు. కానీ ఇక్కడి ఆలయంలోని అర్చకులను 'శక్తి' ఆలయాలకు బదిలి చేస్తే అక్కడ పూజా విధానాలు,ఆచార వ్యవహారాలు వేరేవిధంగా ఉంటాయి.కొందరుఅర్చకులు బాధ్యతలు తీసుకోలేదు. అయితే వెంటనే ఉత్తర్వులు అమలు చేయకపోతే వారికి ఆబ్‌సెంట్ వేయమని అధికారి ఆదేశించినట్లు చర్చ జరుగుతుంది. ఈ బదిలీలప్రక్రియలో జవాబుదారి తనం పారదర్శకత చోటు చేసుకోలేదంటూ కొందరు ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులుకు కూడా ఫిర్యాదు చేసారు.ఆయన ఏం నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలని సిబ్బంది భావిస్తుండగా కార్యాలయం నుంచి రకరకాలుగా బాధ్యతలు స్వీకరించని సిబ్బందికి చరవాణి ద్వారా వత్తిడి వస్తుందని చర్చించుకుంటున్నారు. ఏడాది కాలంలో 28సార్లు బదిలీలు చేసిన ఘనత ఒక్క శ్రీకాళహస్తీశ్వరాలయానికే దక్కిందని చెప్పవచ్చు.

## నిత్యాన్న పథకానికి రూ.10లక్షలు విరాళం



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదానపథకానికి గురువారం శ్రీకాళహస్తికి చెందిన భక్తుడు రూ.10లక్షల వెయ్యి నూటపదహారులు విరాళంగా ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందించారు. శ్రీకాళహస్తికి చెందిన టిటిడి బోర్డు చైర్మెన్ అకేపాటి చెంగర్‌రాయరెడ్డి మనవడు ఆర్కొ పార్టీ విక్రమ్‌రెడ్డి పదిలక్షల వెయ్యిన్ని పదహారు రూపాయల చెక్కును అందించారు. వారికి చైర్మెన్ శ్రీనివాసులు ప్రత్యేక దర్శనం ఏర్పాటుచేసారు. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. శేష వస్త్రాలను అందించారు. ఈకార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి సభ్యుడు మహీధర్‌రెడ్డి ఆలయాధికారులు పాల్గొన్నారు.

## స్పందన ఫిర్యాదులపై చిత్తశుద్ధితో దర్యాప్తు చేసి

తిరుపతి క్రైం, ఏప్రిల్ 20, ప్రభాతవార్త : స్పందన ఫిర్యాదులపై అలసత్వం వహించకుండా చిత్తశుద్ధితో దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పి పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం తిరుపతి జిల్లా పుత్తూరులో పుత్తూరు, రేణిగుంట, శ్రీకాళహస్తి సబ్ డివిజన్ల డిఎస్పి, సిఐ, ఎస్ఐలతో జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి మాట్లాడుతూ గతంలో పుత్తూరు సబ్ డివిజన్ పరిధిలో నాటు సారా తయారీ అమ్మకం ఎక్కువగా జరిగేది. మన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆపరేషన్ పరివర్తన 2.0 కార్యక్రమాన్ని సమర్థవంతంగా, కచ్చితత్వంతో అమలు చేసి నాటు సారా తయారీకి సంబంధించిన జిల్లా వ్యాప్తంగా 32 గ్రామాల్లో దాదాపు 26 గ్రామాలను, కుటుంబాలను పరివర్తన చెందిన వారికి పునరావాస సౌకర్యాలను కూడా కల్పించడం జరిగింది. ఎన్‌డిపిఎస్ కేసులకు సంబంధించి గంజాయి వినియోగం రవాణా సరఫరా జరగకుండా కఠిన చర్యలు అమలు చేసామన్నారు. అవసరమైతే పిడి యాక్ట్ కేసులను నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పిలు వెంకటరావు పరిపాలన, కులశేఖర్ శాంతి భద్రత, విమల కుమారి నేర విభాగం, మునిరామయ్య తిరుమల, సెబ్ జాయిన్ డైరెక్టర్ రాజేంద్ర, ఎస్బి డిఎస్పి సురేంద్ర రెడ్డి, డిఎస్పిలు, డిసిఆర్‌బి, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## చంద్రబాబు పేరున 774 కొబ్బరికాయల మొక్కులు



తిరుమల,ఏప్రిల్ 20ప్రభాతవార్తప్రతినిధి: 2024లో రాష్ట్రంలో అఖండమెజార్టీతో తెలుగుదేశం పార్టీ గెలిచి మళ్ళీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు రావాలని కోరుతూ కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామిని వేడుకున్నట్లు టిడిపి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బి.శ్రీధర్‌వర్మ తెలిపారు. ఆయన ఆయురా రోగ్యాలతో ఉండాలని, ప్రజలకు సేవ చేసే భాగ్యం కలగాలని కోరారు. చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా గురువారం ఉదయం తిరుమలలో తెలుగుయువత నాయకుడు, టిడిపి రాష్ట్రమీడియా కోఆర్డినేటర్ బి.శ్రీధర్‌వర్మ, భాస్కర్‌వర్మ,రూపేష్‌వర్మ, మధు, వెంకటస్వామి,సుబ్బు,గౌతం తదితరులతో కలసి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ముందు అఖిలాండం వద్ద 774కొబ్బరికాయలు కొట్టారు. 7.40కిలోల కర్పూరం వెలిగించారు. ఈ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## ప్రజలు చంద్రబాబు నాయకత్వం కోరుకుంటున్నారు

**-2024లో సిఎంకావాలని చూస్తున్నారు -టిడిపి రాష్ట్రకార్యదర్శి పుష్పావతియాదవ్**



తిరుపతి,ఏప్రిల్ 20ప్రభాతవార్త: తెలుగుప్రజల ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పి, పేదప్రజల సంక్షేమానికి పథకాలు అమలుచేసిన నాయకుడు చంద్రబాబునాయుడు అని, ఆయన నాయకత్వం మళ్ళీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వి.పుష్పావతియాదవ్ తెలిపారు. 2024లో చంద్రబాబు సిఎం కావాలని రాష్ట్రప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. చంద్రబాబు 73వ జన్మదినం సందర్భంగా గురువారం ఉదయం అన్నారావుకూడలిలో 73కిలోల కేక్‌ను కట్‌చేసి టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఇక్కడ పార్టీ శ్రేణులతో కలసి పుష్పావతియాదవ్ పేదలకు అన్నదానం చేశారు. ఈరాష్ట్రం మళ్ళీ అభివృద్ధివైపు ముందుకు నడవాలంటే చంద్రబాబు రావాలని, కావాలని ప్రజలు కోరుతున్నారన్నారు.

## ఎముకలసాంద్రత పటిష్టతకు... పౌష్టికాహారం తీసుకోవాలి:డాక్టర్ సుకుమార్



తిరుపతినగరం,ఏప్రిల్ 20ప్రభాతవార్త: 40ఏళ్ళు పైబడిన వాళ్ళంతా ఎముకలసాంద్రత పటిష్టతకు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సాయిసుధ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి అధినేత డాక్టర్ బి.సుకుమార్ సూచించారు. ఎప్పటికప్పుడు మోకాళ్ళు నొప్పులతో బాధపడేవారు ఎముకల సాంద్రత తెలుసుకుని తగిన నివారణ చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గురువారం ఉదయం రెడ్డిరెడ్డి కాలనీలోని సాయిసుధా ఆస్పత్రిలో ఉచిత డిఎంబి వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సుకుమార్, డాక్టర్ నిఖిలేష్, డాక్టర్ నవీన్, డాక్టర్ హిమబిందు,ఫిజియోథెరఫీ డాక్టర్ సునీత, సుజాత, పార్వతి, రానాప్రతాప్, శీను, సతీష్, నరేంద్రధరణి, కమల్, సోమశేఖర్ ,మహేష్ తదితరులు పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

## రంజాన్ ఇఫ్తార్ విందు



తిరుపతి,ఏప్రిల్ 20ప్రభాతవార్త: పవిత్రమైన రంజాన్‌మాసంలో ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏవన్ కేటరింగ్ అధినేత మస్తాన్, రాయలసీమ కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి కలసి ఏర్పాటుచేశారు. గురూవారం సాయంత్రం ఈ విందుకు నగరంలోని ముస్లింలు హాజరై అభివాదం చేసుకున్నారు.

## ఫిర్యాదుపై పోలీసులు వెంటనే స్పందించాలి : జిల్లా ఎస్పీ



నారాయణవనం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త : బాధితులు న్యాయం కోసం పోలీసుస్టేషన్ వచ్చిన ఇచ్చిన ఫిర్యాదులపై వెంటనే పోలీసులు స్పందించి వారికి న్యాయం చేసి అండగా నిలవాలని తిరుపతి జిల్లా ఎస్పీ పి పరమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పుత్తూరు రూరల్ సర్కిల్ పరిధిలోని నారాయణవనం పోలీస్‌స్టేషన్‌లో వార్షిక తనిఖీని చేపట్టారు. ఈ సందర్భంగా కేసుల సంబంధించి అన్ని రకాల రికార్డులను క్షుణంగా పరిశీలించారు. కేసులు ఏవైనా పెండింగ్‌లో వుంటే వాటిని త్వరితగతంగా పరిష్కరించాలని తెలిపారు. అలాగే ఫిర్యాదుదారులతో ఆత్మీయంగా, హుందాగా వ్యవహరించి పోలీసుశాఖకు పేరు తీసుకురావాలన్నారు. ఇకపోతే జాతీయ రహదారిపై నిరంతరం పోలీసులు నిఘా పెట్టాలన్నారు. నాటు సారాయి, గంజాయి వంటి మాదకద్రవ్యాల విక్రయదారులు, అమ్మకందారులపై నిఘా పెట్టి కేసులు నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం బాలికలు ఎదుర్కొంటున్న ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ మరియు పోక్సో చట్టం వంటి విషయాలపై సంబంధిత వారికి అవగాహనలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళ పోలీసులు, మెన్ పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలపై అడిగి తెలుసు కొన్నారు. అనంతరం రికార్డులను అన్నింటిని పరిశీలించిన తర్వాత సంతృప్తి వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు డీఎస్పీ రామరాజు, పుత్తూరు అర్బన్, రూరల్, సత్యవేడు సిఐలు లక్ష్మీనా రాయణ, సురేష్‌కుమార్, శివకుమార్, ఎస్ఐలు పరమేష్‌నాయక్, శ్రీకాంత్‌రెడ్డి, రామాంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

## తడ దేశం కార్యకర్తలు సుశిక్షితులైన సైనికులు

**- నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ నెలవల**



తడ, ఏప్రిల్ 20 ప్రభాతవార్త : తడ మండలంలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు సుశిక్షితులైన సైనికులని సూళ్లూరుపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం ఆయన తడలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు 73వ జన్మదినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. స్థానిక బజారు సెంటర్‌లో భారీ కేకు కట్ చేసి చంద్రబాబు, లోకేష్‌లకు జైకొట్టారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ తడ మండలంలోని పార్టీ కార్యకర్తలు ఎప్పుడూ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తున్నారని కొనియాడారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన నాయకులను అభినందించారు. మాజీ జడ్పిటిసి బొమ్మన్ శ్రీధర్, పార్టీ మండల కార్యదర్శి ఆర్.నీలకంఠంతో పాటు సీనియర్ నాయకులు కెవి రెడ్డి, యుగంధర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, టికె శ్రీనివాసన్, సుదర్శన్‌రావు, సెల్వం, జీవా, శివాజీ, పళణి, రవి, రమేష్, ధనంజయరెడ్డి, జయపాల్, వల్లం విజయమ్మ, శకుంతలమ్మ, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.